ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 16 ఏప్రిల్ 2025





10 వేల ఎకరాల భూ సమీకరణ!

విమానాశ్రయంతో సత్వర ఆర్థికాభివృద్ధి!

రాజధాని నగరంలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించే ప్రాజెక్టుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమైంది. దీని వల్ల రాజధానిలో వ్యాపార, వాణిజ్యాభివృద్ధి జరుగుతుంది. మల్టీనేషనల్ కంపెనీల కార్యాలయాలు, కర్మాగారాలు ఏర్పాటు చేయటానికి దోహదపడుతుంది. ఎగుమతి, దిగుమతులను పెంపొందిస్తుంది. బెంగళూరు విమానాశ్రయం ఐటీ హార్డ్‌వేర్ ట్రేడ్‌ను గణనీయంగా ప్రోత్సహిస్తోంది. అమరావతికి కూడా అందుకు అనుగుణమైన వ్యాపారాలను పెంచటానికి దోహదపడుతుంది. విమానాశ్రయం వల్ల మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా అప్‌గ్రేడ్ అవుతాయి. రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందుతాయి. కార్గో, లాజిస్టిక్ హబ్‌గా కూడా అభివృద్ధి చెందుతుంది. పండ్లు, పూలు, ఔషధాల ఎగుమతులకు దోహదపడుతుంది. ముంబయి విమానాశ్రయం ఒక్కటే 40శాతం ఎయిర్ కార్గోను నిర్వహిస్తోంది. ఈ విమానాశ్రయం వల్ల స్థానికంగా రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతుంది. విమానాశ్రయం చుట్టూ ఉండే భూములు 300 నుంచి 500 శాతం వరకు పెరుగుతాయన్నది అంచనా. స్థానిక వస్తువులకు గ్లోబల్ మార్కెట్ లభిస్తుంది. దీంతో పాటు ఆరోగ్య, విద్యా సదుపాయాలు పెరుగుతాయి. పర్యాటకరంగం కూడా అభివృద్ధి చెందుతుంది. ఇన్ని ఆర్థిక పరమైన ప్రయోజనాలున్నందునే ముందుగా అంతర్జాతీయ విమానాశ్రయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఐదు వేల ఎకరాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం తక్షణం భూములను సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.





అమరావతికి దగ్గరగా ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతంలో ఉన్న 10 వేల ఎకరాల భూములను యుద్ధ ప్రాతిపదికన సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. యండ్రాయి, కర్లపూడి, తాడికొండ, వైకుంఠపురంలోని భూములను టాప్-3 ప్రాధాన్యతా ప్రాజెక్టుల కోసం తీసుకోవాలని యోచిస్తోంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి ఐదు వేల ఎకరాలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం 2,500 ఎకరాల చొప్పున తీసుకోవాలన్నది ఆలోచన. అవసరమైన భూములను తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంగీకారం తెలిపినట్టు సమాచారం. మిగిలిన భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం తర్వాత తీసు కోవాలని చూస్తున్నారు. అయితే భూ సమీ కరణ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

- ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య సీఆర్‌డీఏ ఎంపిక
- ఎయిర్ పోర్టుకు 5 వేలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్కుకు 2,500, స్పోర్ట్స్ సిటీకి 2,500 ఎకరాలు
- గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులు పూర్తయిన రెండేళ్లకు మరో 34 వేల ఎకరాల సమీకరణ
- మల్టీ కనెక్టివిటీ కోసమే.. ఇన్నర్, అవుటర్ మధ్య ప్రాంతం గుర్తింపు
- తుళ్లూరు మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయం !
- ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు భూములు తీసుకోవాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

రాజధాని అమరావతిని పరిపాలనా కేంద్రంగానే కాకుండా సమాంతరంగా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ సూచించిన విధంగా ఆర్థికాభివృద్ధిని తీసుకురావటానికి వీలుగా అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీలను (మిగతా 6వ పేజీలో)

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుతో పర్యాటక రంగ అభివృద్ధి



స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుకు కూడా భూములను సమీకరించాలని నిర్ణయించింది. స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా అమరావతి సత్వరాభివృద్ధికి దోహదపడుతుంది. స్పోర్ట్స్ సిటీ అనేది క్రీడలు, ఫిట్‌నెస్, వినోద కేంద్రంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి క్రీడా స్టేడియాలు, ట్రైనింగ్ అకాడమీలు, స్పోర్ట్స్ మ్యూజియాలు, ఫిట్‌నెస్ సెంటర్లు, హోటళ్లు రిటైల్ మాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, ఆటగాళ్లు, కోచ్‌ల రెసిడెన్షియల్ జోన్లు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ సిటీ వల్ల పర్యాటక రంగం, రియల్ ఎస్టేట్ బూమ్, స్థానిక వ్యాపారం పెరగటం, ఉద్యోగాల కల్పన పెద్ద ఎత్తున జరుగుతుంది.

సాగుకు.. మంచి రోజులు

సాగర్ కుడి కాలువ పరిధిలో మరమ్మతులు

- సమాయత్త మవుతున్న జలవనరుల శాఖ
- మూడు జిల్లాల్లో 355 పనుల గుర్తింపు
- రూ.19.28 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు



మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వానంగా ఉన్న కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. కాల్వల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులను జల వనరుల శాఖ గుర్తించింది. రూ.19.28 కోట్లు వ్యయం అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వారంలో నిధుల మంజూరుపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని అధి కారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు కాల్వల మరమ్మతులను విస్మరిం చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాల్వల మరమ్మతులకు రూ.22.54 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. మరో విడత నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది.

దుస్థితిలో కాల్వలు

మేజర్, మైనర్, సబ్ మైనర్ కాల్వలన్నీ అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. దీంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాల్వల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటికాడ, రబ్బరు మొక్కలు అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయి.. షట్టర్లు దెబ్బతిన్నాయి, చాలా మైనర్ కాల్వల తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సరఫరాలో నియంత్రణ ఉండడం లేదు. నీటి పారుదల సమయంలో ఎక్కువగా నాచు పెరుగుతోంది. నాచు పెరిగిన వెంటనే తొలగించకపోతే దిగువకు నీరు పూర్తి స్థాయిలో సరఫరా కాదు.

అధికారుల నిర్లక్ష్యం..నేతల జోక్యం

ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. జనవనరుల శాఖ అధికారులు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తొలి విడతగా రూ.22.54 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ పనులు చేపట్టేందుకు గతేడాది మరమ్మతుల టెండర్లు నిర్వహించింది. కొందరు అధికార పార్టీ నేతలు అనుచరులకు పనులు దక్కకపోవడంతో బలవంతంగా టెండర్లు రద్దు చేయించారు. తిరిగి టెండర్లు నిర్వహించి, పనులు చేపట్టే అంశంలో అలసత్వం తాండవిస్తోంది. మాచర్ల, సత్తెనపల్లి డివిజన్‌లలో కాల్వల మరమ్మతులు పూర్తి చేశారు. వినుకొండ పరిధిలో 34 పనులు వ్యయం అంచనా రూ.1.78 కోట్లు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. 24 పనులు చేపట్టారు. మిగతా పది పనులు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేసే ప్రక్రియ జరుగుతోంది. లింగం గుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 77 పనుల వ్యయం అంచనా రూ.4.21 కోట్లు. ఈ పనుల టెండర్ ప్రక్రియ పూర్తిచేయడంలో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఇక్కడ అధికార పార్టీ నేతలు టెండర్లు నిర్వహించకుండా అడ్డుతగులుతున్నారన్న విమర్శలున్నాయి. కాల్వలకు నీటి సరఫరా కూడా నిలిపివేశారు. అధికార పార్టీ నేతలు కరుణిస్తేనే ఈ డివిజన్‌లో పనులు జరిగే దుస్థితి నెలకొంది. ఈ రెండు డివిజన్‌లలో తొలి విడత నిధలతో పనులు పూర్తి చేయడంలో విఫలమైన అధికారులు.. రెండో విడత నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. కాలువల మరమ్మతులపై అధికార పార్టీ నేతల జోక్యం రైతులకు శాపంగా మారింది. సాగు నీటి సంఘాలు కాల్వల మరమ్మతులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



షట్టరు లేని తూము

355 మరమ్మతు పనుల గుర్తింపు

వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్లలో 355 అత్యవసర మరమ్మతులను అధికారులు గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.19.28 కోట్ల వ్యయం అంచనా వేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనుల నిర్వహణకు రూ.2.17 కోట్లు, గురజాల నియోజకవర్గంలో 31 పనులకు రూ.2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ.2.34 కోట్లు, పెదకూరపాడు సెగ్మెంట్‌లో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ.2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ.2.30 కోట్లు, చిలకలూరిపేట సెగ్మెంట్‌లో 29 పనులకు రూ.1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులకు రూ.1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గంలో 54 పనులకు రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా ప్రతిపాదనలు పంపించడం జరిగింది.

హేతుబద్ధమే.. ప్రభుత్వ నిబద్ధత!

సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణకు సిద్ధమైంది. అనసవర ఖర్చులు తగ్గించి, పాలనలో పారదర్శకత పెంచి, ఉద్యోగుల విధులు సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో గతంలో గ్రామాల ప్రాతిపదికన ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటైన సచివాలయాలు సగానికి పైగా తగ్గనున్నాయి. వీటిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి జవాబు దారీతనం తీసుకురానుంది.

- గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్
- జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ గ్రేడ్‌లుగా విభజన
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,583 సచివాలయాలు
- సగానికి తగ్గి... 798కి సంఖ్య పరిమితం
- గతంలో గ్రామాల ప్రాతిపదికన ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్) ప్రక్రియ ప్రారంభమైంది. జనాభా ప్రాతిపదికన హేతుబద్ధీకరణకు అధికారుల కసరత్తు దాదాపుగా ముగిసింది. ఒకటి రెండు చోట్ల తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం అధికారులు తయారు చేసిన జాబితానే తుది ఆమోదం పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,583 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండ గా ప్రస్తుతం ఆ సంఖ్య 798కి పరిమితం కానుంది. సగానికి పైగా సచివాలయాల సంఖ్య తగ్గనుంది. గుంటూరు జిల్లాలో 568 సచివాలయాకు 282, పల్నాడు జిల్లాలో 538 సచివాలయాలకు 268, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలకు 248 మిగలనున్నాయి. గ్రామాల ప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

మూడు గ్రేడులు

గ్రామ, వార్డు సచివాలయాలను జనాభా ప్రాతిపదికన ఎ, బి, సి గ్రేడ్‌లుగా ప్రభుత్వం విభజించనుంది. 2,500 మంది జనాభా ఉన్న సచివాలయాలను ఏ గ్రేడ్, 2,500 నుంచి 3,500 మంది జనాభా ఉన్న సచివా లయాలను బీ గ్రేడ్, 3,500మందికి పైగా జనాభా ఉన్న సచివాలయాలను సీ గ్రేడ్ నుంచి కిందకు తేనున్నారు. ఏ గ్రేడ్ సచివాలయంలో ఆరుగురు, బీ గ్రేడ్‌లో ఏడుగురు, సీ గ్రేడ్‌లో 8 మందికి పైగా సిబ్బందిని కేటాయిస్తారు. ప్రతి సచివాలయంలో ఒక సెక్రటరీ లేదా డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. సిబ్బందిని కూడా టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి విధులు అప్పగిస్తారు.



ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్ అధికారులు ఇప్పటికే హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని ప్రభుత్వ ఆమోదం కోసం మంగళవారం సాయంత్రానికి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఎంపీడీఓలు అప్రమత్తమయ్యారు. అయితే, జాబితాలు సిద్ధం చేసిన తర్వాత వాటిని స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల సూచనల మేరకు ఒకటీ రెండు చోట్ల మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

తీపికబురు రాబోతోంది..!

- జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థలంపై ప్రభుత్వం దృష్టి
- 77 ఎకరాల సద్వినియోగానికి ప్రణాళిక
- ప్రజలకు ఉపాధి కల్పన దిశగా ఆలోచన
- సీఎం ప్రకటన కోసం ఎదురు చూస్తున్న ప్రజలు



మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ

వేమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని జంపని గ్రామంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీకి చెందిన విలువైన స్థలంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. రాజధాని సమీపంలో ఉన్న విలువైన భూమిని ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా తీర్చిదిద్దాలన్న ఆలోచన పాలకులు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. 77 ఎకరాల ఫ్యాక్టరీ భూమిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలన్న సంకల్పం కనబడుతోంది. తెనాలి, కొల్లూరు ప్రధాన రహదారిలోని ఈ భూమిలో 1974 డిసెంబరు 4న సహకార రంగంలో ఫ్యాక్టరీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. 1983-84లో క్రషింగ్ సీజన్ ప్రారంభించారు. 2012 వరకు ఫ్యాక్టరీ నడిచింది. 2012 ఫిబ్రవరి 20న మూతపడింది. ఫ్యాక్టరీ కోసం భూమిని సేకరించిన ప్రభుత్వం.. ఆనాడు రైతుల నుంచి అతి స్వల్ప ఖరీదుతో కొనుగోలు చేసింది. రేపల్లె ప్రాంతం నుంచి పెదకూరపాడు వరకు దాదాపు 12 వేల మందిని షేర్ హోల్డర్లుగా చేర్చుకుంది. ఫ్యాక్టరీ మూతపడడంతో ఉద్యోగులకు ఇంకా రూ.11 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఫ్యాక్టరీ నిర్వహణకు సహకార సంస్థలు ప్రైవేట్ సెక్టార్ల నుంచి తెచ్చిన అప్పు వడ్డీతో కలిపి రూ.180 కోట్ల వరకు చేరుకుంది. జంపనితో పాటు రాష్ట్రంలో సహకార రంగంలోని 9 ఫ్యాక్టరీల పరిస్థితి ఇలాగే ఉంది. అయితే, జంపని ఫ్యాక్టరీ భూములపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ ఆధారిత పరిశ్రమను కానీ, ఇంకేదైనా పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. 3 వేల మందికి ప్రత్యక్షంగా.. వేల మందికి పరోక్షంగా లాభం కలిగించేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఫ్యాక్టరీ సామగ్రిని రూ.9 కోట్లకు స్థలం పరిధిలో ఉన్న చెట్లను రూ.55 లక్షలకు విక్రయించారు. వ్యవసాయ ఆధారిత గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ ప్రభుత్వ భూమిని సద్వినియోగం చేసే విషయంలో ప్రజలంతా ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వ ఆస్తి వృథాగా ఉండే కన్నా సద్వినియోగం చేస్తే ప్రభుత్వానికి, ప్రతినిధులకు మంచి పేరు వస్తుందని పేర్కొంటున్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతం కింద తమ గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయడంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యం వహిస్తున్నారని, అద్దంకి మండలం తిమ్మారెడ్డిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి తమ సమస్యలను విన్న వించారు. 2006 నుంచి గ్రామంలో తాగునీరు మొదలుకుని.. రోడ్ల వరకు అన్ని సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయానని వివరించారు. భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇంకా 25 ఎకరాలకు పెండింగ్‌లోనే ఉందని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఇదే విషయాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీసీఎల్ఏ కమిషనర్‌తో మాట్లాడారని చెప్పారు. మంత్రి గొట్టిపాటి కూడా సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీంతో తక్షణమే స్పందించిన జేసీ ప్రఖర్‌జైన్ ప్రాజెక్టు ఎస్‌డీసీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కదలిక రావడంతో తిమ్మారెడ్డిపాలెం వాసులు హర్షం వ్యక్తం చేశారు. జేసీని కలిసిన వారిలో చందలూరి రామాంజనేయులు, బత్తుల సుబ్బారావు, అంజయ్య తదితరులున్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన గానన్ యూనివర్సిటీ ప్రతినిధి

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీను యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సీ అగర్వాల్ మహేష్ సందర్శించారు. ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యతో



యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సీ అగర్వాల్ మహేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ విద్యాపరిశోధన, బోధన తదితర అంశాల్లో రెండు యూనివర్సిటీలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

10 వేల ఎకరాల భూ సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్లతో కలిపి రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇదికాకుండా బ్యాంకుల నుంచి, ఇతర ఆర్థిక సంస్థలు కలిపి మొత్తంగా మరో రూ.55 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలని భావిస్తోంది. మొత్తం లక్ష కోట్లతో అమరావతి నిర్మాణ పనులు చేస్తుంటే, సమాంతరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందకపోతే భవిష్య త్తులో సంక్షోభం చవిచూసే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రపంచ బ్యాంకు సూచించిన విధంగా అమరావతి నిర్మాణ పనులతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాల్సి వస్తోంది.

స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీతో అనేక ప్రయోజనాలు

అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ ప్రాజెక్టును కూడా ప్రభుత్వం ఎంచుకుంది. టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక నగరాన్ని స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ అంటారు. ఇందులోని పరిశ్రమలు డిజిటల్‌గా ఇంటిగ్రేట్ అయి ఉంటాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ద్వారా ఉత్పాదకతను పెంచడం, గ్రీన్ ఎనర్జీ అంటే సౌర, పవన శక్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలు ఉంటాయి. అలాగే, ఇవన్నీ కూడా రోడ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి అనుసంధానం (మల్టీమోడల్ కనెక్టివిటీ)గా ఉంటాయి. స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ వల్ల భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించవచ్చు. తద్వారా ఉద్యోగాల సృష్టి ఎక్కువగా జరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం ఇస్తుంది. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 2,500 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది.

అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతం పరిశీలన

ఈ మూడు ఎకనమిక్ బూస్ట్ ప్రాజెక్టులకు ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్యన భూములు సమీకరిస్తేనే సార్థకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మల్టీ మోడల్ కనెక్టివిటీ సాధించాలంటే.. ఈ ప్రాంతమే మంచిదని యోచిస్తోంది. అమరావతి నూతన రైల్వే లైను కూడా మంజూరైన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ రైల్వేలైన్ వెళ్తుంది.. దీనికోసం 800 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా అమరావతిలో వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ గ్రామాల్లో సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ ద్వారా ఇక్కడి భూము లను సమీకరించి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం భూములు ఎక్కడ తీసుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఏఏఐ అధికారులతో చర్చించాక కానీ ఓ స్పష్టత రాదు. ఎయిర్‌పోర్టు అవసరాల కోసం తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెద్దపరిమి, హరిశ్చంద్రపురం, తాడికొండ మండలంలోని మోతడక గ్రామాల్లో భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలనుకుంటున్నారు.

మరో 30 వేల ఎకరాలపై దృష్టి

అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాక రాజధాని విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలన్నది ప్రభుత్వ ఆలోచన. గవర్నమెంట్ కాంప్లెక్స్ పనుల్లో ఐకానిక్ టవర్లు మినహా మిగిలినవన్నీ రెండేళ్లలో పూర్తవుతాయి. మిగిలిన 30 వేల ఎకరాలను రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం, అనేక భాగస్వామ్య సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సమీకరించాలన్న ఆలోచన జరుగుతోంది. దేశంలోనే పేరెన్నికగన్న రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలను కూడా ఇప్పటికే ఆహ్వానించారు. ఇలాంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల న్నింటికీ అవసరమైన భూములను సమీకరించాలని, నిధులను కూడా సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

రంగస్థల గౌరవం

- కళాకారులకు కందుకూరి రంగస్థల పురస్కారాలు
- రాష్ట్ర స్థాయిలో ముగ్గురి ఎంపిక
- అందులో ఇద్దరు ఉమ్మడి గుంటూరు వాసులు
- అందుకోనున్న రంగస్థల నటులు కందిమళ్ల, ఏవీ
- జిల్లాల వారీగా విశిష్ట పురస్కారం
- ప్రకటించిన ఏపీ ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్
- నేడు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం

నరసరావుపేట కల్చరల్, తెనాలి అర్బన్, చిలకలూరిపేట, బాపట్ల ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పలువురు రంగస్థల కళాకారులకు సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం రంగస్థల ప్రతిష్టాత్మక, విశిష్ట పురస్కారాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను మంగళవారం ప్రకటించారు. కందుకూరి 177 జయంతిని పురస్కరించుకుని.. 2025వ సంవత్సరానికి గాను రాష్ట్ర, జిల్లా స్థాయిలో వీటిని ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురిని, జిల్లాల స్థాయిలో 107 మందిని ఎంపిక చేశారు. ఆరాధ్యుల వెంకటేశ్వరరావు(తెనాలి), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (చిలకలూరిపేట), డాక్టర్ గుర్రాల రవికృష్ణ(నంద్యాల) రాష్ట్రస్థాయి పురస్కారం ప్రదానం చేయనుంది. వీరికి రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారు. జిల్లా స్థాయిలో విశిష్ట పురస్కారాన్ని పల్నాడు నుంచి షేక్.షఫీ ఉజ్మ, బెత్తినేని వెంకట లక్ష్మయ్య, దేవరపల్లి అన్నపూర్ణ, వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్ అందుకోనున్నారు. గుంటూరు జిల్లా నుంచి భూక్యా శ్రీనివాస నాయక్, ఏపూరి హరిబాబు, అయినాల మల్లేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, గాదె నాగభూషణం, పొగర్తి నాగేశ్వరరావు, గోపరాజు విజయ్, బి.నాగరాణి, అమృత వర్షిణి, గుడివాడ లహరి, సురభి ప్రభావతి, గుమ్మడి విమల కుమారి ఉన్నారు. బాపట్ల జిల్లా నుంచి లుక్కా సోమేష్, లింగంగుంట పద్మావతి, పోలూరు సుబ్బారావు పురస్కారం అందుకోనున్నారు. వీరికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన..



కందిమళ్ళ సాంబశివరావు | ఆరాధ్యుల వెంకటేశ్వరరావు

పల్నాడు జిల్లా నుంచి విశిష్ట పురస్కారానికి ఎంపికైన...



షేక్ షఫీ ఉజ్మ | వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్

తెలుగు నాటక రంగంపై కందిమళ్ల పరిశోధనలు

కందుకూరి రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ప్రముఖ నాటక రచయిత, రంగస్థల ప్రముఖుడు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు చిలకలూరిపేటలోని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల నుంచి తెలుగు ప్రొఫెసర్ గా ఉద్యోగ విరమణ చేశారు. 'తెలుగు నాటక రంగం నూతన ధోరణులు, ప్రయోగాలు' అనే అంశంపై పీహెచ్‌డీ, 'గుంటూరు జిల్లా నాటక రంగ చరిత్ర' అనే అంశంపై డి లిట్ పట్టాలను నాగార్జున, బరంపురం విశ్వవిద్యాలయాల నుంచి ఆయన పొందారు. సారా సంహారం, సై సై జోడెడ్ల బండి వంటి 18 నాటకాలు నాటికలను రచించారు. ఉత్తమ నాటక రచయితగా నాగార్జున, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న, ప్రపంచ తెలుగు మహా సభల పురస్కారాలతో పాటు గిడుగు తెలుగు భాషా పురస్కారాలను అందుకున్నారు. కందిమళ్ల రచించిన అభినయ భారతాచార్య చాట్ల శ్రీరాములు, తెలుగు నాటకం ఉద్యమ నేపథ్యం నాటక గ్రంథాలకు ప్రభుత్వం నంది పురస్కారం ప్రదానం చేసింది.

పురాణ పాత్రల్లో మెప్పించిన ఏవీ సుబ్బారావు

రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన వెంకటేశ్వరరావు ప్రముఖ రంగస్థల నటుడు ఏవీ సుబ్బారావు కుమారుడు. ఆయన 1972లో రంగస్థలంలో ప్రవేశించి శ్రీకృష్ణుడు, అర్జునుడు, శ్రీరాముడు పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు. నాలుగు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. 800కు పైగా సత్కారాలు పొందారు. పూర్ణశ్రీ నాట్య కళా సమితి స్థాపించి, చింతామణి నాటకంలో లవ్ సీన్, శ్రీకృష్ణ రాయబారంలో పడక సీను, గయోపాఖ్యానంలో వార్ సీన్ వంటి ఆడియో, వీడియో రికార్డులు, పలు బిరుదులు పొందారు. పలువురు ప్రముఖుల నుంచి అవార్డులు, సత్కారాలు అందుకున్నారు.

ఆకట్టుకున్న నా శత్రువు, అసత్యం నాటికలు



నా శత్రువు నాటికలో ఓ సన్నివేశం



అసత్యం నాటికలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్, కొరిటెపాడు వేదికగా నిర్వహిస్తున్న డాక్టర్ మాగంటి మురళీ మోహన్ నాటకోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రెండు నాటికలు ప్రదర్శించారు. తొలుత పీ బాలాజీ దర్శకత్వం వహించిన విశాఖప ట్నం వారి 'అ సత్యం' నాటిక కళాభిమానులను అలరించింది. అనంత రం యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి 'నా శత్రువు' నాటిక ఆకట్టుకుంది. సభా కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, కన్వీనర్ గుమ్మడి శ్రీమన్నారాయణ, కళా సమితి అధ్యక్షుడు కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు జ్యోతి ప్రజ్వలన చేసి, వై.కే. నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో పాల్గొన్న జి. మల్లికార్జునరావు, డీ. తిరుమలేశ్వరరావు, జానీబా షాల నిర్వహణలో అతిథులను కళాకారులను సత్కరించారు.

మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

- రెండో విడత భూ సమీకరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- రూ. 42,360 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

తుళ్లూరు, (అనంతవరం) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. మంగళవారం రాజధాని గ్రామం అనంతవరంలో మంత్రి పర్యటించారు. గతంలో మైనింగ్ శాఖ సీఆర్డీఏకి కేటాయించిన గ్రావెల్ క్వారీలను మంత్రి పరిశీలించారు. రాజధాని పనులకు గ్రావెల్ ఇక్కడ నుంచి తీసుకోవచ్చా అనే దానిపై కొండ ప్రాంతంలో పర్యటించారు. అయితే ఇప్పటికే చాలా లోతుగా తవ్వి గ్రావెల్ వినియోగించటం వలన ఈ ప్రాంతంలో తీయటం కుదరదని మంత్రి స్పష్టం చేశారు. తవ్విన ల్యాండ్‌ని ఏ విధంగా ఉపయోగించాలనేది తెలుసుకోవటం కోసం వచ్చానని మంత్రి చెప్పారు. డ్రోన్ సహాయంతో పరిశీలించాల్సి ఉందన్నారు. రాజధాని పనులకు అవసరమైన గ్రావెల్ కోసం గుంటూరు, మాచర్ల ప్రాంతాలలో గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీఏకి కేటాయించినట్లు చెప్పారు. అమరావతిలో రెండో విడత ల్యాండు పూలింగ్(భూ సమీకరణ)పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి నారాయణ మీడియాతో చెప్పారు. అమరావతిలో 5వేల ఎకరాలలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కట్టాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన అని మంత్రి అన్నారు. అందుకోసం భూసేకరణ బదులు పూలింగ్ (సమీకరణ)చేయాలని రైతులు కోరుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో రాజధాని అమరావతి పనులు ఆలస్యం అవుతున్నట్లు మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 93 వర్క్‌లకు గాను 68 వర్క్‌లకు రూ.42,360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు చేయటానికి కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అందుకు అవసరమైన కార్మికులను కంపెనీలు రంగంలోకి దింపినట్లు చెప్పారు. మంగళగిరి తాడేపల్లి, గుంటూరు, విజయవాడను కలిపి త్వరలో మెగా సిటీగా ఏర్పాటు చేయాలనే ఆలోచనతో సీఎం ఉన్నారన్నారు. అందుకే అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ముప్పై వేల ఎకరాలు భూ సమీకరణ చేయాల్సి ఉందన్నారు. వీటిల్లో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వగా మిగిలిన భూముల్లో డ్రైన్‌లు , రోడ్లు ఇతర మౌలిక వసతుల కోసం మరికొన్ని వేల ఎకరాల అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులు, మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



అనంతవరంలో గ్రావెల్ క్వారీ ప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

బంగారు కుటుంబాల వివరాలు సేకరణ





సంకుర నవీన్, బుర్రా చిన్నమ్మాయి కుటుంబ వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు, పీ-4 కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న సీఎం నారా చంద్రబాబునాయుడు ఎస్సీ సామాజిక వర్గం ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో పీ-4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన కుటుంబాలలో మెకానిక్ సంకుర ప్రవీణ్, కార్పెంటర్ సంకుర నవీన్, బడ్డీకొట్టు నిర్వాహకురాలు బుర్రా చిన్నమ్మాయి, నిరుద్యోగి సరిగల నీలిమా తదితర కుటుంబాల సమస్యలు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. దీంతో మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ ఆదేశాల మేరకు తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి, పంచాయతీ కార్యదర్శి షేక్ జాన్‌లు వారి వారి కుటుంబాలకు వెళ్లి వివరాలను సేకరించారు. పీ-4 కుటుంబాల ఆర్థిక సామాజిక స్థితిగతులను విచారించి పూర్తి నివేదికలు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

18 నుంచి జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

వినుకొండటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నుంచి జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. పోటీల్లో సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్, సేద్యపుసైజు, ఆరుపళ్ల, నాలుగు పళ్ల, రెండు పళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాలకు ఈ నెల 18వ తేదీ లోపు కుంటా కోటిరెడ్డి 9440383545, మదాల చిరంజీవి 9490224445, రాధాకృష్ణ 9490920887 నంబర్లను సంప్రదించి ఎంట్రీలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సీనియర్ విభాగంలో 2వేల కేజీల బండరాయి పోటీల్లో మొదటి బహుమతి రూ.1.25 లక్షలు, 2వ బహుమతి రూ.లక్ష రూపాయలు, 3వ బహుమతి రూ.75వేలు.. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బహుమతులను స్వయంగా ఇవ్వనున్నారని, అదేవిధంగా 4నుంచి 10వ బహుమతి వరకు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటకోటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

వినుకొండటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చేపలకు వెళ్లి విద్యుదాఘా తంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఏనుగుపాలెం సమీపంలోని కొంకేరు వాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు... మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన ఉప్పలపాటి వెంకటకోటేశ్వర రావు (31) తో పాటు మరో వ్యక్తి చేపల కోసం గాలాలతో వెళ్లారు. చేతిలో ఉన్న గాలాలు పైనున్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తాకడంతో ప్రమాదానికి గురై వెంకట కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు. మృతునికి భార్య శిరీషాతో పాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు.

ఉమ్మడి జిల్లా కార్మిక శాఖలో బదిలీలు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తు న్న సహాయ కార్మిక కమిషనర్లను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు నగరంలో సహాయ కార్మిక కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ సుభానీ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సభ్యురాలుగా పనిచేస్తున్న దండ మూడి లక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. నరసరావుపేటలో సహాయ కార్మిక కమిషనర్‌గా పనిచేస్తున్న జీ ధనలక్ష్మి ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మంగళగిరిలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సభ్యుడుగా పనిచేస్తున్న కట్టా శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

గుంటూరు(విద్య),ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్‌కు గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కోసం తయారు చేసిన సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఈనెల 20లోగా తెలియజేయాలని డీఈవో సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్ deognt.blogspot.com అనే వెబ్‌సైట్ ద్వారా జాబితా పరిశీలించుకోవాలని, అభ్యంతరాలు నిర్దేశించిన తేదీలోగా అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్స్ జాబితా సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసులు బెదిరిస్తున్నారని రౌడీ షీటర్ ఆత్మహత్యాయత్నం

◆ ఆ ప్రచారంలో వాస్తవం లేదు : సీఐ బ్రహ్మయ్య

సత్తెనపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు వేధిస్తున్నారంటూ రౌడీ షీటర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. పలనాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ స్టేషన్ రైటర్ రవీంద్ర డబ్బులివ్వమని బెదిరిస్తున్నాడని, పాకాలపాడుకు చెందిన షేక్ ఖాశిం సైదా సోమవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఖాశిం సైదా ఏరియా వైద్యశాల నుంచి విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో స్టేషన్ రైటర్ రవీంద్ర బాగా ఇబ్బంది పెడుతూ డబ్బులు కోసం డిమాండ్ చేస్తూ బెదిరిస్తున్నాడని, రవీంద్ర చెప్పినట్లు సీఐ చేస్తున్నారన్నారు. ఇప్పటికే రవీంద్ర తనను ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసులో ఇరికించాడని, తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తనకు న్యాయం జరగక పోతే చనిపోతానంటూ వీడియోలో పేర్కొన్నాడు. ఖాశిం సైదా ఫిర్యాదుతో పట్టణ సీఐ బ్రహ్మయ్య ఏరియా వైద్యశాలకు వెళ్లి ఖాశిం సైదాను విచారించారు. ఖాశిం సైదా ఆరోపణల్లో వాస్తవం లేదని, రౌడీ షీటరైన ఖాశిం సైదాను ఆదివారం కౌన్సెలింగ్ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు పిలిపించి పంపటం జరిగిందన్నారు. మద్యం తాగిన మైకంలో ఎలుకల పేస్ట్ తిన్నానని రౌడీ షీటర్ ఖాశిం సైదా పోలీసుల పై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆయన తెలిపారు. ఖాశిం సైదా వెనుక కొంత మంది వ్యక్తులు ఉండి అసత్య ప్రచారం చేయిస్తున్నారని, వారిని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సెలింగ్‌కు రాకుండా ఉండేందుకే కొంత మంది రౌడీ షీటర్లు ఈ విధంగా చేయించారన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసరావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కే శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన తూర్పుగోదావరి జిల్లా ఏటిపాకలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. డిప్యూటేషన్‌పై గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ప్రభుత్వం నియమించింది. రెండు మూడు రోజుల్లో ఈడీగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సిబ్బంది వెల్లడించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 515.20 అడుగులు ఉంది. ఇది 140.66 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,47,684 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,68,585 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,47,684 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 75,504 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు. 5	10000	12800
273	10000	12500
341	10500	13500
4884	10000	11400
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12300
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12400
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ప్రతి రోజు తాగునీటి సరఫరా : కమిషనర్

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు ప్రతిరోజు తాగునీరు సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. రోజుమార్చిరోజు సరఫరా చేస్తామని ముందుగా ప్రకటించామన్నారు. అయితే ఇరిగేషన్ కాల్వలకు నీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ప్రతి రోజు తాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

సోలార్ యూనిట్‌లతో విద్యుత్ బిల్లు ఆదా

● ధ్రువసోలార్ పవర్ మేనేజర్ సుశీల్‌కుమార్

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సోలార్ యూనిట్‌లు ఏర్పాటు చేసుకోవటం ద్వారా నెలకు 360 సోలార్ యూనిట్‌లను ఉత్పత్తి చేయటం వల్ల కరెంట్ బిల్లులు ఆదా చేసుకోవచ్చు అని ధ్రువ సోలార్ పవర్ మేనేజర్ సుశీల్‌కుమార్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం గృహసముదాయాలకు సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ అవసరాలు అందించే అంశంపై మెప్మా ఆర్పీలు, సీవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు సుశీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ధ్రువ సోలార్ పవర్ వారు ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ పథకం ద్వారా వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ముందుగా రూ.20 వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాల్ చేస్తారన్నారు. తదుపరి బ్యాంక్ ద్వారా రూ.లక్షా 80 వేలు మంజూరు చేస్తారన్నారు. 45 రోజుల తర్వాత రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. పెట్టుబడి మొత్తాన్ని నెలసరి వాయిదా పద్ధతిలో చెల్లింపు చేయవచ్చు అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, సీవోలు విజయలక్ష్మి, నవక్రాంత్, మేరీ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ధ్రువసోలార్ పవర్ మేనేజర్ సుశీల్‌కుమార్

బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తే ఉపేక్షించం : ఎస్పీ



బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యువతను క్రికెట్ బెట్టింగ్‌లకు ప్రోత్సహించే వారిని ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్ళు, లాడ్జిలు, రిసార్ట్స్, దాబాలు, రెస్టారెంట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్‌మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది స్వార్థపరులు వారి స్వలాభం కోసం యువతను బెట్టింగ్‌ల ఊబిలోకి లాగే అవకాశం ఉందన్నారు. అటువంటి కార్యకలాపాలను కట్టడి చేయటానికి తనిఖీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉన్నయెడల సంబంధిత పోలీసులకు తెలపాలన్నారు. హోటళ్ళు, లాడ్జీలు, రిసార్ట్స్‌లలో బస చేయటానికి వచ్చే వారి గుర్తింపు కార్డులు తనిఖీ చేసి వివరాలు రికార్డులలో నమోదు చేయాలన్నారు. లేదా డయల్ 100/112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

● పట్టణ సీఐ ఆర్.రాంబాబు

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్‌లు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి హోటళ్ళు లాడ్జిలు తనిఖీ చేశారు. సాయిప్యాలెస్ లాడ్జిలోని రికార్డులను పరిశీలించి పలుసూచనలు చేశారు. కొత్త వ్యక్తులు, అనుమానితులను విచారించారు. బస చేసే ప్రతి ఒక్కరి వివరాలను క్షుణ్ణంగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మే 10వ తేదిన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్, 6వ అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబు తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్, క్రిమినల్, భరణం కేసులు, మోటారు ప్రమాద కేసులు, రెవెన్యూ కేసులు, చెక్‌బౌన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు. బాపట్లన్యాయ స్థానాల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వివాదాలను శాంతియుతంగా రాజీ చేసుకోవాలని కోరారు.

నేడు కానుకల హుండీ లెక్కింపు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 16వ తేదీ భక్తులు సమర్పించిన 5 కానుకల హుండీలను దేవదాయశాఖాధికారులు భక్తుల సమక్షంలో తెరిచి కానుకలను లెక్కించటం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని, పురుషులు పంచధరించి, మహిళలు సాదా చీర లేక పంజాబి దుస్తులను మాత్రమే ధరించి ఈ హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చునని ఆలయ కార్యనిర్వాహణాధికారి తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

● సమగ్రశిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పాఠశాలల్లో సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్రశిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి తెలిపారు. బాపట్ల సమగ్రశిక్ష కార్యాలయంలో మంగళవారం ఈఈ, ఎఫ్ఏవో, ఏఎంవో, ఏఈలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 31 పాఠశాలలను పిఎమ్‌శ్రీ కింద ఎంపిక చేసి కెమిస్ట్రీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీలు, స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, ఆర్ట్ రూమ్ మొదలైన ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పనులను రెండు వారాలలో పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో ఈఈ నాగజ్యోతి, ఎఫ్ఏవో సాయిధావలి, ఏఎంవో డాక్టర్ బిళ్ళా మోజెస్ పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వ గుర్తింపు పత్రాలు అందజేత

కర్లపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల నల్లమోతువారిపాలెం గ్రామంలో ఇటీవల గృహం కాలిపోయి సర్వం కోల్పోయిన సాంబయ్యకు ప్రభుత్వ గుర్తింపు పత్రాలను మంగళవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అందజేశారు.


ప్రభుత్వ గుర్తింపు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో

జాబ్‌కార్డు ఉన్న వారికి పనులు కల్పించాలి : ఎంపీడీవో

కర్లపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న వారందరికి పనులు కల్పించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, యూనిట్ ఇన్‌చార్జి, గ్రామపెద్దలు, మాడా శ్రీనివాసరావు, గరిగంటి శ్రీను, మునిపల్లి చిన్న, ఏపీఎం శ్యామ్, ఫీల్డ్ అసిస్టెంట్ టీబీ షాలిని, నీటి సంఘం ఉపాధ్యక్షుడు బీసాబత్తుని నాగాంజనేయులు, కూలీలు పాల్గొన్నారు.

బదిలీలలో సముచిత స్థానం కల్పించాలి : తాండ్ర

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సైనికుల కుటుంబ సభ్యులలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిని ప్రిఫరెంషియల్ క్యాటగిరి ప్రకారం బదిలీలు చేయాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న మాజీ సైనికులు, సైనికుల సతీమణులకు ఉద్యోగ బదిలీల విషయంలో సముచిత స్థానం కల్పించి హోంస్టేషన్‌కు దగ్గరగా పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఈ విషయమై మంగళవారం ఆయన సంఘ నాయకులో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బోర్డర్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికులు దూరంగా ఉండటం వల్ల ఇంటికి దగ్గరగా సైనికుని భార్యను బదిలీ చేస్తే కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంటుందన్నారు. దీనిపై రాష్ట్రవిద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా స్పందించి తగిన విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణాలలో లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణాలపై ఆశాఖ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు మంజూరు చేస్తున్న పక్కా గృహాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. గృహాలు నిర్మించుకునే విధంగా లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. గృహనిర్మాణాలలో చీరాల డివిజన్ పురోగతి లేకపోవటంపై సంబంధిత డీఈని ప్రశ్నించారు. 15,321 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను ఎంపిక చేయగా 3,576 మందికి గృహాలను మంజూరు చేశామన్నారు. బాపట్ల మండలంలో 1121 గృహాలు నిర్మించాలని లక్ష్యం కాగా 52 పూర్తి చేయటం ఏమిటన్నారు. సాధించిన లక్ష్యం 4.40 ఉండటం ఏమిటన్నారు.

ఇంజనీరింగ్ అధికారులు పద్ధతి మార్చుకోవాలి

లబ్ధిదారులకు బిల్లుల సమస్యలు రానివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. గృహనిర్మాణాలలో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. పీఎంఏవై గ్రామీణ్‌లో చీరాల డీఈ పని తీరు సరిగ్గాలేదన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో చెరుకుపల్లి, కారంచేడు, చుండూరు, ఇంకొల్లు, పర్చూరు, వేటపాలెం మండలాలలో పురోగతి లేకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. గడిచిన 40 రోజుల్లో ఆ మండలాల్లో ఒక్క మరుగుదొడ్డి నిర్మించకపోవటం ఏమిటని నిలదీశారు. ఇంజనీరింగ్ అధికారులు పద్ధతి మార్చుకొని పనిచేయాలని హెచ్చరించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వర్లు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి

బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ఈ విషయమై మంగళవారం కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు దీనిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వివరించాలన్నారు. మున్సిపాలిటీలు, మండలపరిషత్ బడ్జెట్‌లో 15 శాతం నిధులు అంగన్‌వాడీ సెంటర్‌లకు కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న యెడల పాఠశాలలో ఆటస్థలం, మరుగుదొడ్లు వాడుకునే అవకాశం కల్పించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో 5సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాల వాతావరణం సరిపడేవిధంగా, పాఠశాలలో చదువుకునే విధంగా పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈవో ఎస్.పురుషోత్తం, సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ రాధామాధవి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకాధికారి వై.వెంకటేశ్వర్లు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం గడియారస్తంభంసెంటర్, బస్టాండ్, రైల్వేస్టేషన్, సినిమా థియేటర్‌లలో కరపత్రాలు పంచుతూ అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. పాతబస్టాండ్ కూడలిలలో ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి వాటర్ డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపకసిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లి దేవాలయంలో అన్నం సతీష్ పూజలు

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కొండపాటూరులో ఉన్న శ్రీ పోలేరమ్మతల్లి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నం సతీష్‌కు దేవస్థానం వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి జరుగుతున్న మల్లెల పూజలో పాల్గొని అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.


పోలేరమ్మతల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న సతీష్ ప్రభాకర్ కుటుంబ సభ్యులు

ఎమ్మెల్యే చెల్లించిన డబ్బులు జమ చేయలేదంటూ విమర్శలు

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మన ఎమ్మెల్యే-మనవార్డు కార్యక్రమంలో భాగంగా 5వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఓ పేద వృద్ధురాలికి తాగునీటి కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.6,500 చెల్లించారు. వెంటనే మున్సిపల్ అధికారులు ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేసినప్పటికి ఎమ్మెల్యే చెల్లించిన డబ్బులు మాత్రం సంబంధిత ఖాతాలో జమచేయలేదు. దీంతో సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందిపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డిలను వివరణ కోరగా ట్యాప్ కనెక్షన్ డబ్బులు సచివాలయ సిబ్బంది దగ్గర ఉన్నాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో 22 రోజులు నుంచి ఈఆర్‌పీ రావటంలేదు కావున డబ్బులు చెల్లించలేదన్నారు. ఈఆర్‌పీ వచ్చిన వెంటనే చెల్లించటం జరుగుతుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ సభ్యుడు కోన రఘుపతి పిలుపునిచ్చారు. పీఏసీ సభ్యుడిగా నియమించిన తర్వాత విదేశీ పర్యటన ముగించుకొని మంగళవారం సాయంత్రం బాపట్లకు విచ్చేసిన కోన రఘుపతికి పార్టీశ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ప్రదర్శనగా వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీశ్రేణులు బాణాసంచా కాలుస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోన రఘుపతి మాట్లాడుతూ కూటమి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కర్లపాలెం ఎంపీపీ యారం వనజ, జోగి రాజా, డి.సీతారామిరెడ్డి, ఏడుకొండలు, వెంకట్రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగరాజు మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగరాజు శ్రీనివాసరావు (80) మంగళవారం మృతి చెందారు. 1981లో మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేసిన ఆయన 1985లో బాపట్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే ఆయన మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.

రైతులకు నూతన వంగడాలు అందిస్తున్న ప్రభుత్వం

● జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

కర్లపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు నూతన వంగడాలను యాజలి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా అందిస్తుందని, శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు హెక్టారుకు 150కిలోల విత్తనాలను రైతులకు ఉచితంగా అందిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ తెలిపారు. కర్లపాలెం మండల యాజలి రైతు ఉత్పత్తిదారుల సంస్థలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ -వేరుశనగ కార్యక్రమంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ క్యాక్రమంలో యాజలి ఉత్పత్తిదారుల సంస్థ ఛైర్మన్ లక్ష్మీ, బాపట్ల,చీరాల, రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు, శాస్త్రవేత్త మురళినాయక్‌రైతులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

అమృతలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అమృతలూరులో పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు వేమూరు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు.


కుచ్చెళ్లపాడు గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి సాధిక్ ఆలీ

ప్రణాళికబద్ధమైన అభివృద్ధి కోసమే గ్రామసభలు

● కార్యదర్శి సాధిక్ ఆలీ

వేమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికబద్ధమైన అభివృద్ధి సాధన కోసమే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన విధానాలతో గ్రామసభలను ఏర్పాటు చేయడం జరిగిందని కుచ్చెళ్లపాడు పంచాయతీ కార్యదర్శి షేక్ సాదిక్ ఆలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో గ్రామ సభలు నిర్వహించారు. ఉపసర్పంచ్ పెరికల రోజాకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సాధిక్ ఆలీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తి ప్రణాళికలు, స్వచ్ఛంద సేవాదళ పని తీరు, భూమి అభివృద్ధి నిధులు, సహకార సంఘం పని తీరు, పంచాయతీ ఆస్తులు ఆమోదిత బడ్జెట్ ఆడిట్ నివేదికలు తదితరమైన 16 ప్రధాన అంశాలను సభలో చర్చించారు. అజెండా ప్రకారం చర్చించిన అంశాలపై సభ్యుల ఆమోదం తెలిపారు. సభలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావుకు సీపీఎం నాయకులు మంగళవారం వినతి పత్రం అందించారు. భట్టిప్రోలులో పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా రోడ్ల వెంట ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందని, మురుగు కాల్వల పూడికతీత కూడా మెరుగుపడటం లేదన్నారు. జనాభాకు తగ్గ విధంగా పారిశుధ్య కార్మికులు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. కాల్వల్లో పూడికతీతలు లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు దోమ కాటు బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, మనోజ్‌కుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయుడు మురళీమోహన్‌కు డాక్టరేట్ ప్రదానం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఆఫ్ హ్యూమనిటీ విభాగంలో ఉపాధ్యాయుడు మురళీమోహన్‌కు మనం ఫౌండేషన్ డాక్టరేట్ ప్రదానం చేసింది. మండల పరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుర్రం మురళీమోహన్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఉన్న సిటి కల్చర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్ డాక్టరేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ ఛైర్మన్ కె.చక్రవర్తి, దైవాజ్ఞశర్మ సరస్వతి, శ్రీరామమూర్తి, త్రినాథరావు, శ్రీపాద సుబ్బరాజు, అర్చన, శివలీల పాల్గొన్నారు.


డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ తదితరులు

మోర్ల శ్రీనివాసరావుకు భారత్‌సేవ విభూషణ్ నేషనల్ అవార్డు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వారి సౌజన్యంతో హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో గల సిద్ధి కల్చరల్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పిట్టలవానిపాలెం గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావును భారత్‌సేవ విభూషణ్ నేషనల్ 2025వ సంవత్సరంకు సంబంధించి అవార్డుతో ఘనంగా సత్కరించారు. మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల్, ప్రముఖ న్యూరాలజిస్ట్ దైవజ్ఞశర్మ చేతుల మీదగా ఈ అవార్డును శ్రీనివాసరావు అందుకున్నారు. శ్రీనివాసరావుకు పిట్టలవానిపాలెం గ్రంథాలయపాఠకులు, పలువురు గ్రామపెద్దలు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.



మోర్ల శ్రీనివాసరావుకు అవార్డును అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ తదితరులు

ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన

బాపట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విద్యాశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సీడీపీవో లక్ష్మీ పార్వతి, ఎంఈవో ఎస్.నిరంజన్‌లు బాల్య వివాహాలు అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. బాలబాలికలను పాఠశాలకు ప్రవేశాలు ఇప్పించేవిధంగా కృషి చేయాలన్నారు.


పనులను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకుంటున్న శివప్రసాద్

ఖరీఫ్ సీజన్‌కి అక్విడెక్ట్ పనులు పూర్తి చేయాలి

రేపల్లె, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి అక్విడెక్ట్ పనులు పూర్తి చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ సంబంధిత కాంట్రాక్టర్‌లకు సూచించారు. భట్టిప్రోలు కాలువపై అక్విడెక్ట్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.10కోట్ల75లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ అక్విడెక్ట్ పూర్తయితే నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలతో పాటు వేమూరి నియోజకవర్గంలోని భట్టిప్రోలు పంటపొలాలైన 29,430 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు సువర్చల, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

రేపల్లె, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక స్తోమత లేక వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో 70 మంది బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంజూరు చేయించటం జరిగిందని సోదరుడు అనగాని శివప్రసాద్ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధితులకు మంగళవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని ప్రత్యేక దృష్టిసారించి 70 మంది బాధితులకు రూ.88 లక్షల 50వేల 350లు విలువ గల చెక్కులను పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటి ఛైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు డాక్టర్ వేజళ్ళ పూర్ణానందం, గోగినేని పట్టాభి రామారావు, జీవీ నాగేశ్వరరావు, పంతాని సాయికుమార్, లుక్కా గుడారంకయ్య, దేవగిరి రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రూ.4.13 కోట్లతో ఉపాధి పనులు : ఎంపీడీవో

వేమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మండల పరిధిలోని 17 గ్రామాలలో నాలుగు కోట్ల 13 లక్షల 88 వేల నిధులతో 500 పనులను పూర్తి చేసినట్లు ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షల 18 వేల పని దినాలను లక్ష్యంగా పెట్టుకోగా 1,49,270 పని దినాలను పూర్తి చేశామన్నారు. వాటి ద్వారా 3,841 కుటుంబాలకు పని కల్పించడం జరిగిందన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు లేబర్ బడ్జెట్ కింద 13,710 దినాలను కేటాయించారని తెలిపారు. ఏప్రిల్ నెలలో 27,661 పని దినాలను టార్గెట్‌గా పెట్టుకుని వాటిలో 26 శాతం పూర్తి చేస్తామన్నారు. వీటి ద్వారా కూలీలు కేవలం పంట భూముల్లో నీటి గుంటలు తవ్వే పనిని మాత్రమే చేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలో 204 నీటి గుంటలను సాగు భూముల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటిలో 35 తవ్వకాలు పూర్తయ్యాయన్నారు. మిగతా వాటిని గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కూలీల దినసరి వేతనాన్ని రూ.300 నుంచి రూ.307కు పెంపుదల చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు.

భూసార పరీక్షలతో సూక్ష్మధాతు లోపాలు సవరించుకోవచ్చు

వేమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమిలో ఉన్న సూక్ష్మధాతు లోపాలను గుర్తించి సవరించుకునే అవకాశం ఉంటుందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి అక్తర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని కుచ్చెళ్లపాడులో భూసార పరీక్షల నమూనాలు మంగళవారం సేకరించారు. రైతులతో మాట్లాడుతూ, భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమిలో ఉన్న జింకు, ఇనుప ధాతు, నత్రజని లోపాలను గుర్తించి వాటిని సవరించుకునే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సునీత, ఏఈవో జీవమణి, రైతులు పాల్గొన్నారు.


మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రతి ఒక్కరూ సోలార్ వాడకాన్ని ఉపయోగించుకోవాలి

నగరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : సూర్యరశ్మిని సద్వినియోగపరుచుకోవటం ద్వారా గృహాలకు ఆదాయవనరులను ఏర్పరచుకోవచ్చని పెద్దవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భద్రినారాయణ అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులతో మంగళవారం సేవ్ ఎనర్జీ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్, విద్యుత్ వాడకాన్ని తగ్గించి సూర్యరశ్మిపై ఆధారపడాలని, తద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు, ఎంపీపీఎస్ మెయిన్ విద్యార్థులు, టీచర్లు రాఘవయ్య, భాస్కరరావు, అనురాధ లక్ష్మణ్‌రావు, కృష్ణారావు, అరుణ, క్లబ్ సెక్రటరీ జీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రమాణస్వీకారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న చావలిశ్రీధర్ శర్మ

చెరుకుపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవాసంఘ సమాఖ్య ప్రమాణస్వీకారం మంగళవారం జరిగింది. చెరుకుపల్లి మండలానికి చెందిన రావూరి ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవాసంఘసమాఖ్య కార్యదర్శిగా, బొమ్మిడి హరిప్రియ మహిళా కార్యదర్శిగా, చావలి శ్రీధర్ శర్మ ఆంధ్రప్రదేశ్ అర్చకసంఘం ఉపాధ్యక్షుడిగా, మల్లెల కృష్ణమూర్తి ఆంధ్రప్రదేశ్ అర్చక సంఘం కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చావలి శ్రీధర్‌శర్మ, మల్లెల కృష్ణమూర్తికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారికి నేతలు ఎం.రాధాకృష్ణమూర్తి, మల్లాది రామకృష్ణ, కొనకాల రవికిరణ్, తలశిల విజయనాగ్, దివి రాంబాబు అభినందనలు తెలిపారు.

ఎన్నారై విద్యార్థులకు అభినందనలు

చెరుకుపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 12వ తేదీన విడుదలైన ఇంటర్ ఫలితాలలో చెరుకుపల్లి ఎన్ఆర్ఐ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై ఎన్ఆర్ఐ విద్యాసంస్థల సీఈవో ఉమామహేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. జూనియర్ ఇంటర్‌లో 384 మంది హాజరవ్వగా 83.9 శాతం, సీనియర్ ఇంటర్‌లో 300 మంది హాజరవ్వగా 90 శాతం ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కాలేజీ డీన్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ కిషోర్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాల్వలో కారు బోల్తా

కొల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మలుపులో వేగాన్ని నియంత్రించలేక కాల్వలో కారు బోల్తా పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామానికి చెందిన జి.పార్థసారధి అనే వ్యక్తి రేపల్లె నుంచి కారులో వస్తుండగా కొల్లూరు శివారులోని ఫోర్‌ఫ్రంట్ విద్యా సమీపంలోని మలుపు వద్ద వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో పక్కనే ఉన్న కాల్వలోకి పల్టీ కొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న పార్థసారధి గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. కారు ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సెలవుల్లో.. చిన్నారులు జాగ్రత్త

కార్ డోర్ లాక్‌లపై ఏమరపాటు వద్దు

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం దృష్ట్యా ఇప్పటికే పాఠశాలల్లో ఒంటి పూట తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో మధ్యాహ్నమే పిల్లల్లు ఇళ్లకు వచ్చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే వేసవి సెలవులు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో పది నుంచి 12 ఏళ్ల వయస్సు లోపు పిల్లలు ఎక్కువగా ఆటలాడుకుంటుంటారు. వాహనాల లోపలికి చేరి ఆడుకోవడంపై ఎక్కువగా ఇష్టపడుతుంటారు. చాలామంది వాహన యజమానులు అపార్టుమెంట్స్ సెల్లార్లు, ఇండిపెండెంట్ గృహాల్లోని కారిడార్లు, ఇళ్ల ముందు కార్లు పార్కింగ్ చేసి డోర్లు సక్రమంగా లాక్ అయ్యాయో, లేదో చూడకుండా లోపలికి వెళ్లిపోతుంటారు. పొరపాటున డోర్ లాక్ కాకపోతే పిల్లలు వాటిని తెరిచి లోపలికి వెళ్లి ఆడుకుంటుంటారు. ఆ సమయంలో కనక డోర్ లాక్ అయి ఎవరూ చూడకపోతే కాసేపటికే లోపల ఉన్న పిల్లలు ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరికి గురై నిండు ప్రాణాలు కోల్పోతుంటారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కొద్ది రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవడం ఆ తర్వాత షరామామూలుగా నిర్లక్ష్యం వహించడం వాహన యజమానులు/డ్రైవర్లకు పరిపాటైపోయింది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో ఇలాంటి సంఘటనే సోమవారం జరగడం ప్రతీ ఒక్కరి హృదయాలను కలిచి వేసింది.

గతంలో కార్లకు మాన్యువల్ లాక్‌లు ఉండేవి. దాని వలన కారుని పార్కింగ్ చేయగానే తప్పక తాళం వేసేవారు. తాళం వేసిన తర్వాత సక్రమంగా లాక్ అయిందో, లేదో బటన్ ప్రెస్ చేసి చూసుకొనేవారు. అలానే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సైడు అద్దాలను కొంచెం తెరచి ఉంచేవారు. అయితే టెక్నాలజీ మారడం, హైఎండ్ కార్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆటోమేటిక్ డోర్ లాక్ సిస్టమ్స్ అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సందర్భాలలో కారు డోర్లు లాక్ అయ్యాయి కదా అని కీ డోర్ క్లోజ్ బటన్ నొక్కడం మరిచిపోతున్నారు. కారు పార్కింగ్ చేసిన తర్వాత కొద్ది దూరం నుంచి కీ బటన్ ప్రెస్ చేస్తున్నారు. అలారం సౌండ్ రాగానే డోర్లు లాక్ అయ్యాయని భావిస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో అవి లాక్ కావడం లేదు. పిల్లలు వెళ్లి డోర్ లాగగానే అది తెరుచుకొంటున్నది. వాళ్ల లోపలికి వెళ్లాక అది మూతబడుతున్నది. అన్ని డోర్లు మూసి ఉండటం వలన లోపల గాలి ప్రసరణ లేక అందులో ఉన్న పిల్లలకు ఊపిరి ఆడక విలవిల కొట్టుకొంటున్నారు. బయట చల్లగా ఉన్నా కారు లోపల వాతావరణం ఉష్ణంగా ఉంటుంది. దీనికి పిల్లల శరీరం తట్టుకోలేక గుండెపోటుకు దారి తీస్తుంది.



లాక్ చేసినా...

కొంతమంది కారు యజమానులు వాహనానికి పకడ్బందీగానే లాక్ చేస్తున్నారు. అయితే ఇంట్లోకి వెళ్లిన తర్వాత తాళాన్ని పిల్లలకు అందే ప్రదేశంలో పెడుతున్నారు. దాంతో పిల్లలు ఆ తాళాన్ని తీసుకొని కారు వద్దకు వెళ్లి ఓపెన్ లాక్ బటన్ నొక్కుతున్నారు. డోరు తెరుచుకోగానే లోపలికి వెళ్లి క్లోజ్ చేస్తున్నారు. ఆ తర్వాత దానిని ఓపెన్ చేయడం వాళ్లకు తెలియడం లేదు. ఇది కూడా ప్రమాదానికి దారి తీస్తున్నది.

ఇలా చేయండి...

కారు యజమానులు పార్కింగ్ చేసిన తర్వాత లాక్ చేసి ఒకటికి రెండు సార్లు డోర్లు సక్రమంగా మూసుకొన్నాయో, లేదో పరిశీలించాలి. అలానే కారు తాళాలను ఎల్లప్పుడూ పిల్లలకు అందకుండా ఎత్తయిన ప్రదేశంలో ఉంచాలి. పిల్లలను ఇంటి ఆవరణలో ఆడుకునేటప్పుడు వాళ్ల వద్ద పెద్దవాళ్లలో ఎవరో ఒకరు ఉండటం మంచిది. కారు డోర్ లాక్‌లే కాకుండా ఏ ప్రమాదం వచ్చినా కాపాడేందుకు వీలుంటుంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఐరన్ గేట్లను అటు ఇటు నెడుతూ వాటిని మీద పడేసుకొంటుంటారు. అలానే వీధికుక్కలు దాడి చేసే అవకాశం ఉంటుంది. అపరిచితులు కిడ్నాప్‌లు వంటి చర్యలకు కూడా పాల్పడవచ్చు. అలానే కరెంట్ కనెక్షన్లు ఉన్న చోటికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. వీటన్నింటి దృష్ట్యా పిల్లలకు కాపలాగా పెద్దవాళ్లలో ఒకరు ఉంటే మంచిది.

నాటక రంగానికి ఊపిరి పరిషత్‌లు

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- ముగిసిన కొండవీటి కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా 'అసత్యం'

లింగారావుపాలెం(యడ్లపాడు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : నాటకం అంతరించి పోకుండా కళాకారులను, నాటక సమాజాలను ప్రోత్సహిస్తూ ఊపిరి పోస్తున్నవి కళాపరిషత్‌లేనని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. కొండవీటి కళాపరిషత్ 26వ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. గ్రామంలోని పోసాని సుబ్బారావు చౌదరి స్మారక కళావేదికపై మూడు రోజులపాటు రోజుకు మూడు చొప్పున తొమ్మి ది నాటికలు ప్రదర్శితమయ్యాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి లావు రత్తయ్య ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తూ కళామతల్లికి సేవలందిస్తున్న కొండవీటి కళాపరిషత్ నిర్వాహకులు ఎంతైనా అభినందనీయులన్నారు. దీర్ఘకాలం పరిషత్‌ల మనుగడ సాగించేందుకు నిర్వహణ వ్యయాలను రాబట్టుకునే మార్గాలను వెతకాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించి వాటి ద్వారా వనరులను సమకూర్చుకుంటే దీర్ఘకాలం పరిషత్‌లను నిర్వహించేందుకు వీలుకలుగుతుందని సూచించారు. పరిషత్ ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు గుదె పాడు రంగారావు, పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, గుంటూరు కళాపరిషత్ గౌరవాధ్యక్షులు ఆలోకం పెదబ్బయ్య, కొండవీటి కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



అసత్యం నాటిక బృందానికి ప్రథమ బహుమతిని అందజేస్తున్న లావు రత్తయ్య, నిర్వాహకులు

మూడు రోజులు.. 9 ప్రదర్శనలు

మూడు రోజులపాటు 9 నాటకలు ప్రదర్శించగా వాటిలో ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి, విశాఖ వారి 'అసత్యం' నాటిక నిలిచి ప్రథమ బహుమతి సొంతం చేసుకుంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యంగ్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడి వారి '27వ మైలు రాయి', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి 'జనరల్ బోగీలు' నాటికలు బహుమతులు అందుకున్నాయి. ప్రత్యేక జ్యూరీ బహుమతిని యువభేరి థియేటర్స్, హైదరాబాద్‌వారి 'నా శత్రువు' నాటిక అందుకుంది. ఆయా నాటికలకు వరుసగా రూ.20వేలు, రూ.19వేలు, రూ.18వేలు, రూ.17వేలు, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రతి నాటికకు ప్రదర్శనా పారితోషికం రూ.15వేలు, జ్ఞాపికను అందించారు. ఇవికాక ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకులకు నగదు పారితోషికంతోపాటు, జ్ఞాపికలను అందించారు.

వ్యక్తిగత విభాగంలో బహుమతుల వివరాలు

ఉత్తమ రచయిత వీటీ మాధవ్(27వ మైలురాయి), ఉత్తమ దర్శకుడు బాలాజీ నాయక్(అసత్యం), ఉత్తమనటుడు పవన్ (27వ మైలురాయి), ఉత్తమ నటి సురభి ప్రభావతి(27వ మైలురాయి), ఉత్తమ ప్రతినాయకుడు గోపురాజు విజయ్(జనరల్ బోగీలు), ఉత్తమ హాస్యనటన జ్యోతిరాణి(నా శత్రువు), ఉత్తమ రంగాలంకరణ ఎం సత్తిబాబు(అసత్యం), ఉత్తమ సంగీతం లీలామోహన్(27వ మైలురాయి)కి లభించాయి. ఇవికాక ఉత్తమ క్యారెక్టర్, ఉత్తమ సహాయ నటీనటుల విభాగాలలో కూడా బహుమతులు అందజేశారు. 5గురికి ప్రత్యేక జ్యూరీ బహుమతులు అందించారు.

నేడు దర్గా స్వాధీనం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎత్తురోడ్డులోని మస్తాన్ బాబా దర్గాను బుధవారం ఉదయం స్వాధీనం చేసుకుంటున్నామని జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. వాస్తవానికి మంగళవారమే స్వాధీనం చేస్తామని చెప్పామని, ఉన్నతాధికారులు అనుమతి ఆలస్యమవడంతో నేటికి వాయిదా వేశామని అన్నారు. దర్గాకు వచ్చే కానుకల్లో ఏడు శాతం వక్ఫ్ బోర్డుకు చెల్లించకపోవడంతో దర్గా స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. స్వాధీనం చేస్తున్నామని ధర్మకర్తలకు 9న నోటీసులు పంపామని తెలిపారు.



శ్రీ హజరత్ కాలే మస్తాన్‌వలీ ఆవులియా దర్గా

దర్గా... వక్ఫ్ పరిధిలో లేదు

స్థానిక ఎత్తురోడ్డులోని మస్తాన్ బాబా దర్గా వక్ఫ్ పరిధిలో లేదని ఆ దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు స్పష్టం చేశారు. దర్గా ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ పరిధిలో దర్గా లేదని 2000 సంవత్సరంలో జిల్లా కోర్టు వక్ఫ్ పరిధిలో దర్గా లేదని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలియక 2000 ముందు వరకు ఒక వక్ఫ్ బోర్డుకు పన్నులు చెల్లించామని అన్నారు. తిరిగి ఇప్పుడు దర్గాకు వచ్చే కానుకల్లో ఏడు శాతం చెల్లించడం లేదని అందుకే దర్గాను 11న స్వాధీనం చేసుకుంటున్నామని వక్ఫ్ అధికారులు ఈనెల 9న నోటీసులు పంపారని చెప్పారు. 14 వరకు గడువు ఇవ్వాలని అధికారులను కోరానని చెప్పారు. అధికారులు పంపిన ప్రతి నోటీసులకు సమాధానం చెబుతున్నానని తెలిపారు.

ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి


● గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సమయంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా అలాంటి పరిస్థితిని ఎదుర్కొని గొప్ప నాయకుడిగా ఎదిగారని రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ అన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో అంబేడ్కర్ 134వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ టీం స్పిరిట్‌ని కొనసాగించాలని రైల్వే అధికారులకు సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే సైమన్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



రైల్ వికాస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

టమాట ధరలపై అప్రమత్తం



- ● గత పదేళ్లలో ఏటా మే, జూన్, జూలైలోనే పెరుగుదల
- ● ఈ ఏడాది ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంచాలి
- ● జిల్లా మార్కెటింగ్ అధికారులకు ప్రభుత్వం ఆదేశం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టమాట ధరలు ఇప్పుడు తక్కువగా ఉన్నాయని విశ్రమించొద్దని మార్కెటింగ్ జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గత పదేళ్లలో చూసుకొంటే ప్రతీ సంవత్సరం మే, జూన్, జూలై నెలల్లో ధర విపరీతంగా పెరుగుతున్నది. కొన్ని సందర్భాలలో కేజీ రూ. 100 దాటిన పరిస్థి తులున్నాయి. ఆ పరిస్థితుల్లో టమాటల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం చూస్తూ వస్తున్నాం. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు జిల్లాలో ఎక్కడా తలెత్తకుండా చూడాలి. టమాటలు పండించిన రైతులే నేరుగా రైతుబజార్లకు వచ్చి విక్రయించాలి. అప్పుడే దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట పడి ధర పెరగకుండా ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మార్కెటింగ్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

టమాటాలు జిల్లాకు ఎక్కువగా బెంగళూరు, మదనపల్లె మార్కెట్‌ల నుంచి దిగుమతి జరుగుతుంటాయి. స్థానికంగానూ నాటు టమాటాలు ఇక్కడ పండించి రైతులు వివిధ మార్కెట్‌లకు తీసుకొస్తుంటారు. ఏటా ఏప్రిల్ నెలలో పంట అయిపోతుంది. మళ్లీ కొత్త పంట రావడానికి మూడు నెలలకు పైగా సమయం పడుతుంది. ఈ 90 రోజుల్లో ధర నిత్యం పెరుగుతూ పోతుంటుంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు టమాటాలు ఎగుమతి జరుగుతుంటాయి. దీంతో పెరిగిన ధర తగ్గదు. ఆ పరిస్థితుల్లో మార్కెటింగ్ శాఖ టమాటాలను కొనుగోలు చేసి రైతుబజార్లలో కేజీ రూ. 50కి విక్రయిస్తుంటుంది. ఈ నేపథ్యంలో ధరలు ఆకాశాన్నంటకుండా తగిన కట్టడి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులు నేరుగా మార్కెట్‌లు, రైతుబజార్లకు వచ్చి విక్రయిస్తే ధర పెరిగే అవకాశం ఉండదని స్పష్టం చేసింది.

మార్కెట్ ఫీజు వసూళ్లలో అట్టడుగున పల్నాడు జిల్లా

గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు వసూళ్లలో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానం(26)లో నిలిచింది. ఈ జిల్లాకు రూ. 32.14 కోట్ల లక్ష్యంగా కాగా రూ. 25.31 కోట్లు మాత్రమే వసూలు చేసి 78.75 శాతం లక్ష్యానికి చేరింది. గుంటూరు జిల్లాకు రూ. 133.69 కోట్ల లక్ష్యం కాగా రూ. 117.86 కోట్లు వసూలు చేసి 88.16 శాతం లక్ష్యసాధనతో 21వ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా లక్ష్యం రూ. 30.27 కోట్లు కాగా రూ. 27.03 కోట్లు వసూలు చేసింది. 89.31 శాతం లక్ష్యసాధనతో 20వ స్థానంలో నిలిచింది.

100 శాతం పైగా వసూలు చేసిన ఏఎంసీలు

మార్కెట్ ఫీజుని 100 శాతం పైగా వసూలు చేసిన ఏఎంసీలను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అభినందించింది. గుంటూరు జిల్లా పొన్నూరు ఏఎంసీకి రూ. 6.95 కోట్లు లక్ష్యం కాగా రూ. 7.34 కోట్లు వసూలు చేసి 105.64 శాతం లక్ష్యానికి చేరుకొన్నది. అలానే దుగ్గిరాల ఏఎంసీ లక్ష్యం రూ. 3.27 కోట్లు కాగా రూ. 3.40 కోట్లు వసూలు చేసి 104.06 లక్ష్యానికి చేరింది. బాపట్ల జిల్లా చీరాల ఏఎంసీకి రూ. 3.59 కోట్లకు రూ. 3.71 కోట్లు, గుఉఏంటూరు జిల్లా ప్రత్తిపాడు ఏఎంసీ లక్ష్యం రూ. 3.72 కోట్లు కాగా రూ. 3.80 కోట్లు, తెనాలి ఏఎంసీకి రూ. 6.60 కోట్లు లక్ష్యానికి రూ. 6.71 కోట్లు, పల్నాడు జిల్లా వినుకొండ ఏఎంసీకి రూ. 2.93 కోట్లకు రూ. 2.93 కోట్లు, నరసరావుపేట ఏఎంసీకి రూ. 2.24 కోట్లకు రూ. 2.24 కోట్లు వసూలు చేసి 100 శాతం లక్ష్యాన్ని అధిగమించాయి. అలానే బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, గుంటూరు జిల్లాలోని తాడికొండ ఏంఎసీలు 90 శాతం పైగా లక్ష్యాన్ని అధిగమించాయి. ఇక 50 శాతం కంటే తక్కువ వసూలు చేసిన ఏఎంసీలో రొంపిచర్ల ఉన్నది. ఈ మార్కెట్ కమిటీకి రూ. 1.82 కోట్ల లక్ష్యం కాగా రూ. 79.72 లక్షలు మాత్రమే వసూలు చేయగలిగింది.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

● సగటున 90శాతం పైగా ఫలితాలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గురుకుల కళాశాలలోని విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మరో సారి సత్తా చాటారు. మొత్తం 14 గురుకుల కళాశాలలు ఉండగా సగటున 93 శాతం పైగా ఉత్తీర్ణత నమోదైంది. గుంటూరు నగర సమీపంలోని అడవి తక్కెళ్ళపాడు, పల్నాడు జిల్లా కారంపూడి, రామకృష్ణాపురం, అచ్చంపేట, వీపీ సౌత్, ఉప్పలపాడు, అమరావతి, బాపట్ల, నిజాంపట్నం, రేపల్లె, చుండూరు, నాగులపాలెం బాపట్ల జిల్లాలోని నార్త్ అద్దంకి, యద్దనపూడి తదితర ప్రాంతాల్లో గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడవితక్కెళ్ళపాడు గురుకుల కళాశాల, బాపట్ల, విజయపురి సౌత్ గురుకుల కళాశాలలో 97% పైగా ఉత్తీర్ణత నమోదయింది. అదేవిధంగా రామకృష్ణాపురం, అచ్చంపేట, అమరావతి చుండూరు యద్దనపూడి కళాశాలల్లో సగటున 90% పైగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 888 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 791 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 97 మంది ఫెయిల్ కాగా సగటు ఉత్తీర్ణత శాతం 89.07గా నమోదైంది.

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో..

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అడవి తక్కెళ్ళపాడు గురుకుల కళాశాల నుంచి 63 మంది పరీక్ష హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులై నూరు శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. అదేవిధంగా అ చ్చంపేట, ఉప్పలపాడు, చుండూరు గురుకుల కళాశాలలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఇంకా నార్త్ అద్దంకి కళాశాలలో 98శాతం నాగులపాలెం 94 శాతం, బాపట్ల 95శాతం, అమరావతి 96 శాతం, రామకృష్ణాపురం 93 శాతం ఉత్తీర్ణతతో అగ్ర స్థానంలో నిలిచాయి. ఇంటర్ పరీక్షలకు 760 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 701 మంది (92.23 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీ య సంవత్సరంలో 59 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని అడ్వాన్స్ సప్లిమెంటరీలో వారు కూడా పాస్ అయ్యేలా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు గురుకుల కళాశాలల కోఆర్డినేటర్ పద్మజా వెల్లడించారు.



అమరావతిలో..రయ్.. రయ్!

- ఏడీసీఎల్ నేతృత్వంలో రాజధానిలో 38 ప్యాకేజీలతో అభివృద్ధి పనులు
- ఇప్పటివరకు 14 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు
- రాజధానిలో విశాలమైన రోడ్లకు టెండర్లు
- రోడ్ల వెంబడి పచ్చటి చెట్లు, పూల సొయగాలు
- రాజధానిలో పార్కుల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) నేతృత్వంలో అమరావతి రాజధానిలో మొత్తం 38 ప్యాకేజీలలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించటం జరిగింది. వీటిలో ప్రస్తుతం 14 ప్యాకేజీలలో టెండర్లు పిలిచారు. మిగిలిన 24 ప్యాకేజీల పనులు ఇంకా ప్రణాళికల దశలో ఉన్నాయి. ఏడీసీ ఎల్ పిలిచిన 14 టెండర్లకు సంబంధించి చూస్తే.. తొలి మూడు ప్యాకేజీలు వరద నియంత్రణకు సంబంధించి పనులు చేపడుతుండగా.. మిగిలినవన్నీ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్లన్నీ కూడా సువిశాలమైన ఆరు వరుసల రహదారుల స్థానంలోనే ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులు కూడా కలిసి ఉన్నాయి. వీటిలో సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధి, తాగునీటి సదుపాయం కోసం వాటర్ సప్లై నెట్‌వర్క్, మురుగునీటి నిర్వహణ కోసం సీవరేజ్ నెట్‌వర్క్, ఎక్కడ పడితే అక్కడ కరెంటు తీగలు, ఇంటర్‌నెట్ తీగలు, కేబుల్ తీగలు కనిపించకుండా ఉండటానికి భూగర్భంలోనే వాటిని వేసేందుకు వీలుగా యుటిలిటీ డక్ట్, రీయూజ్ వాటర్ లైన్లు, స్ట్రీట్ ఫర్నిచర్ వంటివి అభివృద్ధి చేపట్టాల్సి ఉంటుంది.

ప్యాకేజీల వారీగా ఖర్చు ఇలా..

ప్యాకేజి - 7లో భాగంగా ఈ-6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 452.96 కోట్లు, ప్యాకేజి - 8లో భాగంగా ఈ - 8 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 522.92 కోట్లు, ప్యాకేజి - 9లో భాగంగా ఎన్ - 11 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 419.85 కోట్లుప్యాకేజి - 10లో భాగంగా ఈ - 9 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.490.87 కోట్లు, ప్యాకేజి - 11లో భాగంగా ఈ - 14 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.350.07 కోట్లు, ప్యాకేజి - 12లో భాగంగా ఎన్ - 12 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 614.56 కోట్లు, ప్యాకేజి -13లో భాగంగా ఎన్ - 6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 232.86 కోట్లు, ప్యాకేజి - 14లో భాగంగా ఈ - 5 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 807.75 కోట్లతో నిర్మిచేందుకు ఏడీసీఎల్ టెండర్లు పిలవటం జరిగింది. ఇవి కాకుండా ప్యాకేజి - 4 పనులకు నిర్మాణ వ్యయం రూ.522.39 కోట్లు, ప్యాకేజి - 5 పనులకు నిర్మాణ వ్యయం రూ.98.17 కోట్లు, ప్యాకేజి - 6 లో భాగంగా ముఖ్యమైన మౌలిక సదుపాయాలతో ఎన్ - 15 రహదారి నిర్మాణ వ్యయం రూ.482.12 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలిచింది.

పచ్చదనం అభివృద్ధికి..

అమరావతి రాజధానిలో పచ్చదనం అభివృద్ధికి ఒక్కో రహదారికి రూ.5 కోట్ల చొప్పున మొత్తం 35 రోడ్లకు గాను రూ.175 కోట్లను ఖర్చు చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది. అమరావతిలో రోడ్ల మీద ప్రయాణించే వారికి సెంట్రల్ డివైడర్‌తో పాటుగా రెండు వైపులా అత్యద్భుతమైన పూలమొ క్కలు కనిపించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. అలాగే అమరావతిలో రూ. 25 కోట్ల వ్యయంతో ఆధునిక థీమ్ పార్కులను నిర్మించటానికి కూడా సీఆర్‌డీఏ సన్నద్ధమౌతోంది.



తగ్గిన కూరగాయల ధరలు

- కొనుగోలు దారులు రాక కమీషన్ ఏజెంట్ల ఇక్కట్లు
- కిలో వంకాయ రూ.3
- సొరకాయలు కొనేవారే లేరు
- మార్టూరు పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌లో ఇదీ పరిస్థితి

మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నెలరోజుల కిందట మార్టూరు పచ్చి మిర్చి కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. మార్కెట్‌కు కూరగాయలను తీసుకువచ్చిన రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. కానీ పరిస్థితి భిన్నంగా మారిది. ముఖ్యంగా గత 20 రోజుల నుంచి కూరగాయల ధరలు పడిపోయాయి. కిలో వంకాయ 3 రూపాయలు, దోస కాయలు రూ.4 ఉన్నా కొనేవారే లేరు. సొరకాయలైతే కొనుగోలు చేసే వారు రాకపోవడంతో కొంతమంది కమీషన్ ఏజెంట్లు వాటిని సమీపంలోని గోశాలకు పంపిస్తున్నారు.కనీసం సొరకాయను రూపాయికి కూడా కొనుగోలు చేయడంలేదని వాటిని తీసుకువచ్చిన రైతులతో పాటు, కమీషన్ ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్టూరు మార్కెట్‌కు విజయవాడ, రాజమండ్రి, గుడివాడ, నెల్లూరు, ఏలూరు, నరసరావుపేట, గుంటూరు, ఒంగోలు, తెనాలి, భీమవరం, వైజాగ్ తదితర పట్టణాలులోని మార్కెట్‌లకు చెందిన వ్యాపారులు కూరగాయల కొనుగోలు కోసం వస్తుంటారు. అయితే అక్కడ స్థానికంగా సాగుచేసిన కూరగాయలు అందుబాటులో ఉండడంతో ఈ మార్కెట్‌కు కూరగాయలు కొనేందుకు వారు రావడం లేదు. దాంతో కూరగాయల ధరలు పూర్తిగా తగ్గాయని రైతులు అంటున్నారు. అదీ గాకుండా వేసవి కాలం కావడంతో స్కూళ్లకు చెందిన హాస్టళ్లు మూతపడ్డాయి. ఇతర శుభకార్యక్రమాలు తక్కువగా ఉండడంతో కూరగాయలకు డిమాండ్ తగ్గిందని ఏజెంట్లు అంటున్నారు. దానికి తోడు మార్టూరు ప్రాంతంలో షేడ్ నెట్‌ల ద్వారా కూరగాయల సాగు పెరగడంతో విపరీతంగా కూరగాయలు దిగుబడి రావడం, చుట్టుపక్కల మండలాల్లో బోర్లు, బావుల కింద సాగు చేసిన కూరగాయలు రావడంతో మార్కెట్‌కు వచ్చే కూరగాయలు దిగుబడి తగ్గలేదు. మంగళవారం మార్టూరు కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. 10కిలోలు ప్రకారం వంకాయలు రూ.30 నుంచి రూ.40, దోసకాయలు రూ.30 నుంచి రూ.50, బెండ రూ.50 నుంచి రూ.100, గుమ్మడి కాయలు రూ.80 నుంచి రూ.100, టమాట రూ.250 నుంచి రూ.400, బీరకాయలు రూ.100 నుంచి రూ.120, కాకర రూ.200 నుచి రూ.250, ములగ రూ.150, గోరుచిక్కుళ్లు రూ.100 నుంచి రూ.120, మిర్చి రూ.300 నుంచి రూ.450, దుంపలు రూ.200 నుంచి రూ.250, దొండ రూ.100 నుంచి రూ.120 ధరలు పలుకుతున్నాయి. ఇవన్నీ కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులకు పడుతున్న ధరలు. కానీ విడిగా సాధారణ మధ్యతరగతి ప్రజానీకం దగ్గరకు గ్రామాలకు చిల్లరగా వచ్చే కూరగాయల ధరలు రెట్టింపు పలకడంవిశేషం.


మార్కెట్‌లో ఉన్న దోసకాయలు


కొనుగోలు లేక మిగిలిన సొరకాయలు


గుత్తి వంకాయలు

బాడుగ డబ్బులు కూడా ఇచ్చాను



నిన్న విజయవాడ మార్కెట్ కు మినీ లారీలో సొరకాయలను పంపించాను.వారు సొరకాయలకు డబ్బులు ఇవ్వకపోయినా,కనీసం బాడుగ డబ్బులు కూడా నన్నే ఇమ్మన్నారు. రెండు రోజుల క్రితం కొనేవారు లేక గోశాలకు సొరకాయలను పంపించాను.నెలరోజులనుండి ధరలు తగ్గడంతో కొంతమంది ఏజంట్లు వ్యాపారం ఆపివేశారు.రైతులను వదులుకోలేక అప్పులు పాలవుతూ వ్యాపారం చేస్తున్నాం.

- దారా రామారావు కమీషన్ ఏజెంట్

పశువుల మేతకు వంకాయల బస్తా రూ.200లకు ఇస్తున్నాం



మాది కొణిదెన గ్రామం.ఎ కరా వంకాయల తోట వేశాను. 50 వేల దాకా పెట్టుబడి పెట్టాను.,ఇప్పటికి 40 కోతలు కోశాను,మొదట్లో 10 కిలోలు 70 నుండి 100 రుల దాకా ధరకు అమ్మాను.ఈ రోజు తీసుకువచ్చిన వంకాయలు కిలో 3 రులకు కూడా కొనడం లేదు.మా గ్రామంలో సాటి రైతులు బస్తా వంకాయలను పశువులమేతకోసం 200 రులకు అమ్ముతున్నారు.కోత కూలి,ఆటో బాడుగ,గోతాల ఖర్చులకు చేతి డబ్బులు పడుతున్నాయి.

- గుత్తి వీరాంజనేయులు, కొణిదెన, బల్లికురవ మండలం


సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

ఇళ్ల పట్టాలపై అధికారుల సర్వే

- 10 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- యజమానులు అన్నిపత్రాలు అందుబాటులో ఉండాలని సూచన

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దత్తక్షేత్రం, రోశయ్య కాలనీ, చేనేత కాలనీల్లోని ఇళ్ల పట్టాలపై అధికారులు సర్వే చేపట్టనున్నారు. ఇక్కడి సమస్యపై బాధితులు పలుమార్లు అధి కారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా అధికారుల సూచనల మేరకు తహసీల్దార్ పార్వతి ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు మూడు రోజుల పాటు (16,17,19 తేదీల్లో) ఆ ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ఆరోపణలపై లెక్కలు తేల్చనున్నారు. సుమారు 2వేల పట్టాలను పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సర్వేకు సహకరించండి

మూడు గ్రామాల్లో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు సర్వే చేయనున్నారు. ఈక్రమంలో సంబంధిత పట్టాదారులు, కొనుగోలు దారులు అవసరమైన భూ పత్రాలను అందుబాటులో ఉంచుకుని సర్వే సిబ్బందికి సహకరించాలి. సర్వేలు తేడాలను గుర్తించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్ పార్వతి

నేడు మండల సర్వసభ్యసమావేశం

మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

కందుకూరి రాష్ట్ర పురస్కారానికి ఎంపికైన కందిమళ్ల



మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన ప్రముఖ నాటక రచయిత రంగస్థల ప్రముఖుడు మార్టూరు శ్రీకారం రోటరీ కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టరు కందిమళ్ల సాంబశివరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కందుకూరి రాష్ట్ర పురస్కారాన్ని మంగళవారంప్రకటించింది. కందిమళ్ల తెలుగునాటక రంగం నూతనధోరణులు ప్రయోగాలు అనే అంశంపై పీహెచ్‌డీ, గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్ర అనే అంశంపై డిలిట్ పట్టాలను నాగార్జున బరంపురం విశ్వ విద్యాలయాల నుంచి పొందారు. సారా సంహారం,సైసై జోడెడ్లబండి వంటి 18 నాటకాలు నాటికలను రచించారు. ఉత్తమ నాటకరచయితగా నాగార్జున, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న,ప్రపంచ తెలుగు మహాసభల పురస్కారాలతోగిడుగు తెలుగుభాషా పురస్కారాలను పొందారు.కందిమళ్ల రచించిన అభినయ భారతాచార్య చాట్ల శ్రీరాములు తెలుగునాటక ఉద్యమ నేపథ్యం నాటక గ్రంధాలకు ప్రభుత్వ నంది పురస్కారాలు లభించాయి.సాంబ శి వరావు చిలకలూరిపేటలోని డిఆర్ ఎస్ యస్‌సి విఎస్ కళాశాలనుండి తెలుగు ప్రొఫెసర్ గా ఉద్యోగ విరమణ చేశారు. కందుకూరి రాష్ట్ర పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగునాటక రంగదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విజయవాడ లో జరిగే సభలో ప్రధానం చేస్తారు. అయితే ప్రస్తుతం సాంబ శి వరావు అమెరికాలో ఉన్నారు.

కారును తాకుతూ రోడ్డు

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


కారు టైరుపై నుంచే వేసిన సీసీ రోడ్డు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద పార్కింగ్ చేసిన కారుకు స్థలం ఉంచకుండా టైరులో నుండే అధికారులు సీసీ రోడ్డు నిర్మించారని ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆమోదగిరి పట్నానికి చెందిన యర్రా రూపానంద్ చేనేత కార్మికుడు. అయితే బంధువు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండగా అధికారులు ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారు ముందు చక్రం మీదుగా సీసీ రోడ్డును నిర్మించారు. ఈక్రమంలో ఇంటికి వచ్చి చూసుకున్న రూపానంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ స్థలం విషయంలో గతంలో అధికారులతో వివాదం కూడా జరిగినట్లు సమాచారం.

చిల్లర కొట్టులో చోరీ

రూ.59,245 విలువైన బంగారం, నగదు, సిగరెట్ల అపహరణ

అద్దంకి, ఏప్రిల్ 15 : చిల్లర కొట్టు నిర్వహించే ఇంట్లో చోరీ జరిగి సుమారు రూ.59,245 విలువైన బంగారం, నగదు, సిగరెట్లు అపహరణకు గురయ్యాయి. పోలీస్‌ల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డులో పల్లబోతు రోశమ్మ ఇంట్లో బడ్డీ దుకాణం నిర్వహించుకుంటూ ఉంది. సోమవారం రాత్రి దుకాణం మూసి వేసి ఆయిల్ మిల్ రోడ్డులోని కుమార్తె ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 12 వేల రూపాయల నగదు, 5 గ్రాముల చెవి కమ్మలు, 40 పెట్టెల వివిధ కంపెనీల సిగరెట్‌లు అపహరించుకు పోయారు. ఇంట్లో వెనుక వైపు తలుపు తెరిచి లోపలకు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రోశమ్మ అల్లుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అయితే చోరీ జరిగిన తీరును బట్టి స్థానికంగా ఉండే దొంగలే చోరీకి పాల్పడి ఉంటారని పోలీస్‌లు భావించి ఆ కోణంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ఇప్పటికే చోరికి పాల్పడ్డ యువకులకు సంబంధించిన సమాచారం కూడా లభ్యమైనట్లు సమాచారం.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం శింగరకొండలోని వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కొత్తపేటకు చెందిన గుంజి వెంకయ్యమ్మ జ్ఞాపకార్థం కుమారుడు, రోటరీ సభ్యుడు గుంజి హనుమంతరావు ఆర్థిక సాయంతో శ్రీరామ వృద్ధ ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా రైతుల పొగాకు కొనుగోలుకు ముందుకొచ్చిన జీపీఐ


ఏవో శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న అనంతపురం రైతులు


పొగాకు లోడ్‌తో పార్కింగ్ చేసి ఉన్న లారీలు

మేదరమెట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా పెద్దఒడుగూరు మండలంలోని లక్ష్మీపల్లి, గజదారిపల్లి, చిన ఒడుగూరు గ్రామాలకు చెందిన 25 మంది రైతులు 8 లారీల్లో పొగాకును (వైట్‌బర్లీ) విక్రయించేందుకు మేదరమెట్ల గ్రామానికి ఐదు రోజుల కిందట వచ్చారు. మేదరమెట్ల గ్రామానికి చెందిన పొగాకు కొనుగోలు చేసే వ్యాపారి మాటలు నమ్మి వారు ఇక్కడకు లోడులతో వచ్చారు. కానీ ఆ వ్యాపారి రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. విషయాన్ని స్థానిక విలేకరులు వ్యవసాయాధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ దృష్టికి తీసకువెళ్లారు. ఆయన గ్రోత్ సెంటర్‌లో ఉన్న గాడ్ ఫ్రే పిలిప్ ఇండియా (జీపీఐ) ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పొగాకు కొనుగోలుకు మార్గం సుగమం చేశారు. దీంతో అనంతపురం జిల్లా రైతుల పొగాకును కొనుగోలు చేసేందుకు జీపీఐ ముందుకు వచ్చింది. రైతులకు వద్ద ఉన్న పొగాకును నిబంధనల మేరకు కొనుగోలు చేయడానికి ముందుకువచ్చారు. దీంతో ఐదు రోజుల నిరీక్షణకు తెరపడినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుడి చికిత్స కోసం పూర్వ విద్యార్థుల సాయం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాలుడు చికిత్స కోసం సేవా స్ఫూర్తి కమిటీ 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం చిన్న ఉల్లగల్లు గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు తప్పెట యాయిత్య కిడ్నీ, లివర్, యూరినల్ సమస్యలతో 3 సంవత్సరాలుగా చికిత్స పొంతున్నాడు. ఆర్థిక స్తోమత లేక కుంగిపోతున్న తల్లిదండ్రులు చిన్న, రాజమ్మ సేవా స్ఫూర్తి సభ్యులులైన, గ్రామం లో టీచర్‌గా పని చేస్తున్న బత్తుల పురుషోత్తంను ఆదుకోవాలని కోరారు. దీంతో అతను కమిటీ దృష్టికి తీసుకు రాగా వెంటనే స్పందించిన పూర్వ విద్యార్థు లందరూ రూ.70,500 సాయాన్ని మంగళవారం అద్దంకిలోని గీతా మందిర్ వద్ద తల్లిదండ్రుల సమక్షంలో బాలుడికి అందజేశారు. బాలుడి ఆరోగ్యం కోసం మును ముందు కూడా మావంతు సాయం అందిస్తామని జాగ్రత్తగా వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలుడు ఆరోగ్యం కోసం వెంటనే స్పందించి సాయం అందించిన మిత్రులందరికీ కమిటీ సభ్యులు కృత జ్ఞతలు తెలిపారు.

వల్లాపల్లి విద్యార్థికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : హాలెల్ మ్యూజిక్ స్కూల్ తరపున క్రిస్టియన్ సంగీత పోటీల్లో బల్లికురవ మండలం వల్లాపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన మందా వివేక్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. గత ఏడాది డిసెంబర్ 1న క్రిస్టియన్ గీతాలపై ప్రపంచ స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో వివేక్ కీబోర్డు వాయిస్తూ పాల్గొన్నాడు. కీబోర్డును వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం గంటలో 1046 వీడియోలను అప్‌లోడ్ చేశారు. ఈ బృందంలో వివేక్ కూడా ఉన్నాడు. దీంతో వివేక్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. సోమవారం హైదరాబాద్‌లో వివేక్‌కు పాస్టర్ ఆగస్టీన్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను, మెడల్‌ను అందజేశారు. వల్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వివేక్ మెదటి చిన్నప్పటి నుంచే క్రిస్టియన్ పాటలు అంటే ఎంత మక్కువ. తండ్రి మందా రమేష్ ప్రోత్సాహంతో సంగీత పోటీల్లో పాల్గొని ప్రతిభ సాధించాడు. వివేక్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


గిన్నిస్ వరల్డ్ సర్టిఫికెట్‌తో వల్లాపల్లికి చెందిన వివేక్


కీబోర్డ్‌ను వాయిస్తున్న వివేక్


బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

- మూడవ సారి అధ్యక్షునిగా రమేష్‌బాబు
- స్వల్ప ఓట్లతో ఓటమి చవిచూసిన సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా మంగళవారం ముగిశాయి. ఎన్నికల అధికారిగా రవి కుమార్‌రెడ్డి వ్యవహరించగా ఉదయం నుంచి జరిగిన ఎన్నికల్లో మొత్తం 201 ఓట్లకు గాను 190 పోలయ్యాయి. సాయంత్రం ప్రారంభమైన కౌంటింగ్ ఒక దశలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు సీనియర్ న్యాయవాది కొమ్మనబోయిన నాగేశ్వరరావుకు 91 ఓట్లు దక్కగా, 97 ఓట్లు సాధించి 6 ఓట్ల మెజారిటీతో మూడవ సారి కూడా గౌరవ రమేష్‌బాబు విజయాన్ని అందుకున్నారు. ఒక ఓటు నోటా కాగా, ఉపాధ్యాక్షుడిగా విజయ కుమార్, జనరల్ సెక్రటరీగా రవికుమార్, ట్రెజరరీగా రామ కోటేశ్వరరావు, లైబ్రరీగా కామేశ్వరరావు ఎన్నికయ్యారు. కల్చరర్ సెక్రటరీగా రాజా సాల్మన్, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ మస్తాన్‌వలి, మహిళా ప్రతినిధిగా స్నేహ మాత్రమే వేయడంతో ఆ రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికైన వారిని సహచర న్యాయవాదులు అభినందించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి


ట్రాక్టర్ ట్రక్కు టైరు కింద పడి మృతి చెందిన అంజయ్య

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదిరెడ్డి బావి మలుపు సమీపంలో ట్రాక్టర్ ఒరిగి ట్రక్కు టైరు కింద పడి గోళ్లమూడి అంజయ్య (45) మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు.. కోటపాడు గ్రామానికి చెందిన పూసపాటి శివ శంకర్ మంగళవారం రాత్రి ముప్పవరం వైపు నుంచి ట్రాక్టర్ నడుపుకుంటూ స్వగ్రామానికి వస్తున్నారు. ట్రాక్టర్ ఆదిరెడ్డి బావి సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఒరిగి పడి పోవడంతో ట్రక్కుపై కూర్చున్న కోటపాడు గ్రామానికి చెందిన గోళ్లమూడి అంజయ్య ప్రమాదవశాత్తు తిరగబడ్డ ట్రక్కు టైరు కిందపడి మృతి చెందారు.

నేడు కనిగిరిలో అమరజీవి జయంతి

కనిగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు బుధవారం కనిగిరిలో ఘనంగా జరుగనున్నాయి. కందుకూరు రోడ్డులోని ఎంబీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం పరిశీలిం చా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఉత్సవాల్లో జిల్లాలోని మం త్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లిలో గల పోలేరమ్మ దేవాలయంలో మంగళవారం మధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు. ఆలయం పక్కనే పొలం ఉన్న పల్లా సుబ్బారావు వెళ్తుండగా ఇద్దరు దొంగలు అక్కడ సంచ రిస్తున్నారు.

10 వేల ఎకరాల భూ సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్లతో కలిపి రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇదికాకుండా బ్యాంకుల నుంచి, ఇతర ఆర్థిక సంస్థలు కలిపి మొత్తంగా మరో రూ.55 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలని భావిస్తోంది. మొత్తం లక్ష కోట్లతో అమరావతి నిర్మాణ పనులు చేస్తుంటే, సమాంతరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందకపోతే భవిష్యత్తులో సంక్షోభం చవిచూసే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రపంచ బ్యాంకు సూచించిన విధంగా అమరావతి నిర్మాణ పనులతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాల్సి వస్తోంది.

స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీతో అనేక ప్రయోజనాలు

అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ ప్రాజెక్టును కూడా ప్రభుత్వం ఎంచుకుంది. టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక నగరాన్ని స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ అంటారు. ఇందులోని పరిశ్రమలు డిజిటల్‌గా ఇంటిగ్రేట్ అయి ఉంటాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ద్వారా ఉత్పాదకతను పెంచడం, గ్రీన్ ఎనర్జీ అంటే సౌర, పవన శక్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలు ఉంటాయి. అలాగే, ఇవన్నీ కూడా రోడ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి అనుసంధానం (మల్టీమోడల్ కనెక్టివిటీ)గా ఉంటాయి. స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ వల్ల భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించవచ్చు. తద్వారా ఉద్యోగాల సృష్టి ఎక్కువగా జరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం ఇస్తుంది. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 2,500 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది.

అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతం పరిశీలన

ఈ మూడు ఎకనమిక్ బూస్ట్ ప్రాజెక్టులకు ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్యన భూములు సమీకరిస్తేనే సార్థకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మల్టీ మోడల్ కనెక్టివిటీ సాధించాలంటే.. ఈ ప్రాంతమే మంచిదని యోచిస్తోంది. అమరావతి నూతన రైల్వే లైను కూడా మంజూరైన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ రైల్వేలైన్ వెళ్తుంది.. దీనికోసం 800 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా అమరావతిలో వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ గ్రామాల్లో సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ ద్వారా ఇక్కడి భూములను సమీకరించి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం భూములు ఎక్కడ తీసుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఏఏఐ అధికారులతో చర్చించాక కానీ ఓ స్పష్టత రాదు. ఎయిర్‌పోర్టు అవసరాల కోసం తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెద్దపరిమి, హరిశ్చంద్రపురం, తాడికొండ మండలంలోని మోతడక గ్రామాల్లో భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలనుకుంటున్నారు.

మరో 30 వేల ఎకరాలపై దృష్టి

అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాక రాజధాని విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలన్నది ప్రభుత్వ ఆలోచన. గవర్నమెంట్ కాంప్లెక్స్ పనుల్లో ఐకానిక్ టవర్లు మినహా మిగిలినవన్నీ రెండేళ్లలో పూర్తవుతాయి. మిగిలిన 30 వేల ఎకరాలను రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం, అనేక భాగస్వామ్య సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సమీకరించాలన్న ఆలోచన జరుగుతోంది. దేశంలోనే పేరెన్నికగన్న రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలను కూడా ఇప్పటికే ఆహ్వానించారు. ఇలాంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలన్నింటికీ అవసరమైన భూములను సమీకరించాలని, నిధులను కూడా సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.



గుంతలమయంగా ఉన్న ప్రధాన రహదారి

రోడ్డంతా గుంతలే!

» అవస్థలు పడుతున్న ప్రజలు » రాకపోకలకు ఇబ్బంది

» సమస్యలు పరిష్కరించాలని బుర్లవారిపాలెం వాసుల వేడుకోలు

బుర్లవారిపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఒక్క రోడ్డు.. ఆ రోడ్డుపై వంద గుంతలు. ఇదీ మండల పరిధిలోని బుర్లవారిపాలెం రహదారి దుస్థితి. ప్రమాదకరమైన రహదారితో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. దాదాపు అందరూ నిరుపేదలు కావడంతో రోజువారీ కూలీ, వ్యవసాయం, ఆకు కూరలు సాగు వంటి వాటి మీద ఆధార పడి జీవిస్తున్నారు. రోజువారీ కార్యకలాపాల కోసం నిత్యం గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చీరాల, బాపట్ల వైపు వెళ్లేందుకు అనుసంధానంగా ఉన్న 216 జాతీయ రహదారి నుంచి గ్రామానికి దాదాపుగా కిలో మీటరు రహదారి ఉంది. అదీకూడా వంద గుంతలతో పూర్తిగా ధ్వంసమై ఉంది. ఈ మార్గంలో ప్రమాదకరమైన మలుపు కూడా ఉంది. అటువైపు విద్యుత్ సౌకర్యం కూడా లేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమగోడు పట్టించుకోవాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మలుపు

యువత ఉపాధి కల్పనకు కృషి

» అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష

» సమస్యలపై చర్చ, ప్రజాభిప్రాయ సేకరణ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్‌తో కలిసి తహసీల్దార్ పాలపర్తి పార్వతి ఆధ్వర్యంలో వేటపాలెం పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు జరిగిన కుటుంబ సాధికారత సర్వేపై ఆరా తీశారు. ఈక్రమంలో నిరుద్యోగులు, ఇతరులకు సంబంధించిన ఉపాధి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలతో చర్చించి అభిప్రాయం సేకరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలో వేటపాలెం కూరగాయాల మార్కెట్, పంచాయతీ పార్కుల ఆధునికీకరణపై ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, నివేశన స్థలాలు, పెన్షన్ సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, రవికుమార్, డీఈ శేషయ్య, అధికారులు, ప్రజలు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కొత్తపేట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో యార్లగడ్డ శ్రీహరి కళావేదికను ప్రారంభించారు. రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో పాఠశాలలో నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఏడవ పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొని పౌష్టికాహారాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చీరాల, పేరాల పరిధిలోని పలు చలివేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, మాజీ ఎమ్మెల్యే గోవర్ధనరెడ్డి, తహసీల్దార్ పార్వతి

రక్షణ కవచం శక్తి యాప్

ట్రైనీ డీఎస్పీ అభిషేక్

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినులకు శక్తి యాప్ రక్షణ కవచమని ట్రైనీ డీఎస్పీ అభిషేక్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో సుదీర్ఘంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. నేరాలను గుర్తిస్తే సమాచారాన్ని స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెంటనే అందించాలని సూచించారు. ఆయనతోపాటు ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు, సునీత, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.



శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్



పర్చూరు బొమ్మల సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

రైతుల నిరసన, రాస్తారోకో

పర్చూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేసేవిధంగా ఆయా కంపెనీల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకు రైతులతో కలిసి రైతు, కౌలు రైతు సంఘం నాయకులు మంగళవారం నిరసన, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్ద ఎత్తున పొగాకును సాగు చేయాలని గతంలో సూచించిన కంపెనీలవారు ఇప్పుడు కొనుగోలుకు ముందుకు రావడం లేదన్నారు. దీంతో రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఆయా కంపెనీల వారు పొగాకు కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, అధ్యక్షుడు కొండయ్య, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, డేవిడ్, షేక్ రహీం, రోశయ్య, కౌలు రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పూసపాడు : నల్లబర్లీ పొగాకుకు మంచి ధర ఉన్నా కొనుగోలు చేయడం లేదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు అన్నారు. నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇంకొల్లు మండలం, పూసపాడు అడ్డరోడ్డులో జిల్లా రైతు సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొగ్గవరపు శంకర్రావు, గోవిందరాజులు, మహేష్, పొలు జక్కరయ్య, రామారావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను తక్షణమే వినియోగంలోకి తీసుకు రావాలని చీరాల డివిజన్ డీఎల్‌పీవో బి.శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని వైదన, కొప్పెరపాడు గ్రామాలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను డీఎల్‌పీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతు గ్రామాలలో రోడ్ల వెంట చెత్త కనిపిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో మండల ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



మల్లాయపాలెంలో పోషణ్ పక్వాడాపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో తల్లులు, బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబి పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో మంగళవారం పోషణ్ పక్వాడాపై అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పౌష్టికాహరం తీసుకోవడం వలన కలుగు లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జూపల్లి రాఘవరావు, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావలి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సత్యవతి, రత్నకుమారి, భారతి పాల్గొన్నారు.

నేడు కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినగానుగపాలెం సచివాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కుట్టుమిషన్ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గ్రామాల్లో టీబీ పరీక్షలు

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్నవరం, పూనూరు గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, వారితో దగ్గరగా ఉన్న వారికి మంగళవారం డాక్టరు పీ శ్రీహర్ష ఆధ్వర్యంలో సీవై టీబీ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, బరువుతగ్గుతూ, ఆకలి మందగించిన వారు ఆసుపత్రిలో సీవైటీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయచంద్ర శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజరు నాగేశ్వరరావు, సునంద, సులోచనారాణి పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు



పట్టుబడిన సారా, నిందుతుడితో పోలీసులు, అధికారులు

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం అమ్మకం, సారా తయారీ వంటి నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈక్రమంలో వైకుంఠపురానికి చెందిన కావాటి నాగరాజును అదుపులోకి తీసుకుని అతని వద్ద 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామారావు, ఎస్సై శ్రీహరి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై బంధువుల దాడి

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదనలో ఆస్తి తగాదాల నేపథ్యంలో మహిళపై బంధువులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వైదనకు చెందిన ఒర్సు రమణమ్మను బంధువులైన ఒర్సు వెంకటేశ్వర్లు మరో ముగ్గురు కలిసి పూర్వికుల నుంచి రాబడిన ఆస్తుల పంపకం విషయంలో గొడవపడి సోమవారం దాడి చేశారు. రమణమ్మను అద్దంకి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచా రం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్స్‌తో మెరుగైన బోధన

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం మోడల్ స్కూల్స్‌గా మార్చుతుందని ప్రధానోపాధ్యాయుడు జాకబ్ అన్నారు. మంగళవారం మండలంలోని శింగరకొండపాలెం ఎంపీపీ పాఠశాల పరిధిలోని పలు ఇళ్లకు వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌గా మారితే 1వ తరగతి నుంచి ప్రతి తరగతికి ఒ క ఉపాధ్యాయుడు ఉంటారని, మెరుగైన బోధన అందుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురిని 1వ తరగతిలో చేర్పించినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.హనుమంతరావు, ఐతా శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, అంగన్వాడీ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

ముగిసిన ఒకేషనల్ విద్యా శిక్షణ



అద్దంకి వస్త్ర దుకాణంలో వ్యాపారలావాదేవీలను తెలుసుకుంటున్న కొండమంజులూరు విద్యార్థులు

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పీఎం శ్రీకి ఎంపికైన కొండ మంజులూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఇచ్చే ఒకేషనల్ ఇంటర్న్ షిప్ విద్యా శిక్షణ మంగళవారంతో ముగిసింది. పదవతరగతి పూర్తి చేసిన 81 మంది విద్యార్థినీవిద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో నేర్చుకున్న రిటైలింగ్, ఆటోమేటివ్ ఒకేషనల్ ట్రేడ్లకు సంబంధించి 12 రోజుల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఈ నెల 4 నుంచి 15 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం బాపట్ల సర్వశిక్షా అభియాన్ ఉత్తర్వుల మేరకు నిర్వహించినట్లు హెచ్‌ఎం అణిత తెలిపారు. రిటైలింగ్ ట్రేడ్‌కు గైడ్‌గా ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా గంగా ప్రసాద్, ఆటోమేటివ్ ట్రేడ్‌కు గైడ్‌గా బాలాజీనాయక్ వ్యవహరించారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలను అందజేస్తామని హెచ్‌ఎం అణిత తెలిపారు.

ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక, విధివిధానాల రూపకల్పనపై వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రూపొందించిన వార్షిక ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహిస్తామని ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. గ్రామాలలో పొదుపు సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఉత్సాహ వంతులైన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, లీడ్ ఫార్మర్స్‌తో పాటు సంఘ సభ్యులకు పీఎండీఎస్ కిట్స్ తయారీ, ఎన్‌పీఎం షాపుల ఏర్పాటు, ఆవుల కొనుగోలుకు రుణాలు ఇవ్వనున్నట్లు వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ చందన, ఎంటీ శిరీష, రాజశేఖర్, ఐసీఆర్‌పీలు, వీవోఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు స్టడీమెటీయల్ పంపిణీ

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్‌కు వచ్చిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌ను సక్రమంగా వినియోగించుకుని ప్రావీణ్యత పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి





అద్దంకిలో ఆర్టీసీ సిబ్బందికి, చీరాల రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అగ్నిమాకమాక అధికారి వెంకటరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్ర యాణికులు, ఆర్టీసీ ఉద్యోగులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జా గ్రత్తలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

చీరాల : అగ్ని ప్రమాదం నియంత్రించాలంటే ముందు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి వివి రామకృష్ణ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రైల్వే స్టేషన్, బస్టాండ్, ఎంజీసీ మార్కెట్, గడియార స్తంభం సెంటర్, మసీద్ సెంటర్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాల నియంత్రణలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కరత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఎంపీపీ ఆనందకుమారి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందకుమారి, పక్కన ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

పర్చూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై నిర ్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి అన్నారు. మంగళవారం మండల విద్యావనరుల కార్యాలయ ప్రాంగణంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. తొలుత మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేలా అధికారులు ప్ర త్యేక దృష్టిసారించాలన్నారు. ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మా ట్లాడుతూ వేసవిలో జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో రామ్మోహన్‌రెడ్డి, చెరుకూరు పీహెచ్‌సీ వైద్యుడు బాబు, ఏపీవో రమేష్, ఏపీఎం రామకృష్ణ, సీడీపీవో సుభద్ర, ఎంఈవో సత్యనారాయణ, డీటీ సుధారాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రకాశం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఏలూరులో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అద్దంకికి చెందిన ప్రకాశం ఎయిడెడ్ స్కూల్‌కు చెందిన టంగుటూరి ప్రకాశం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి బ్రాహ్మణ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీగా పదవి పొందిన టంగుటూరి ప్రకాశంకు అద్దంకి బ్రాహ్మణ సంఘ సభ్యులు, ఇతర సంఘాల సభ్యులు అభినందనలు తెలియజేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలో శ్రీ లక్ష్మీ గణపతి షిర్డీ సాయినాథ ఆలయ 21వ వార్షిక మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ షిర్డీ సాయిబాబా మూల విరాట్‌కు భక్తులు పంచామృత అభిషేకం, శ్రీ లక్ష్మీ గణపతి హోమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవ పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. పంచామృతాభిషేకం, ప్రత్యేక పూ జలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, చెన్నుపాటి వీరాంజనేయులు, దామా హనుమంతరావు, కన్నెబోయిన వీరయ్య, వల్లెపు వెంకటేశ్వర్లు, వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి, శ్రీరాం రామలింగేశ్వరరావు, అంజయ్య, ఆలకుంట నాగేంద్రస్వామి, బాపయ్య, అర్చకులు సూర్యమాల మాలకొండమాచార్యులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చి సమస్యను పరిష్కరించాలని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తగా జనరేట్ చేసిన యాప్‌తో కలిగే సమస్యలు, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాల అమలుతో పాటు మేలో కేంద్రాలకు సెలవులు ఇప్పించాలని కోరారు. అంగన్‌వాడీలకు ఇబ్బంది లేకుండా యాప్‌ల పనిభారాన్ని తగ్గిస్తామని, కొత్త సెల్ ఫోన్లు ఇవ్వనున్నామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఆచంట సునీత, రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, జనరల్ సెక్రటరీ కొల్లి లక్ష్మీ నరసమ్మ, ట్రెజరర్ కొడాలి హేమలత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బందారు కల్యాణి పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ ట్రే డ్ యూనియన్ ప్రతినిధులు